Follow: @ANNTELUGU

17-03-2026


ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 79 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్




నందిని సిద్దారెడ్డికి

## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్

02



## విజయ్ ఇంత టార్గెటా?

- త్రిష బర్త్ డే రోజే ఓట్ల లెక్కింపు
- పోలింగ్ సమయంలో విడాకుల తీర్పు

02

## ఏఐసీసీ సంచలన నిర్ణయం

- తెలంగాణలో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు
- కమిటీలో సీఎం, పీసీసీ చీఫ్ తో పాటు ఉత్తమ్, దామోదర, సీతక్క

02

# మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా

## ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ

విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

గవర్నర్ శివప్రతాప్ శుక్లా

తొలిసారి తెలంగాణ అసెంబ్లీలో ప్రసంగం



**హైదరాబాద్, మహా :** ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుంది అని, ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. "శ్రమించేతత్వం గల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. ప్రజా కేంద్రీకృత పాలన ప్రభుత్వ విధానం. విజన్2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్డు మ్యాప్ రూపొందించాం. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18లక్షలకు చేరింది. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్ అనుసరిస్తున్నాం. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందని అంచనా. జీహెచ్ఎంసీని ఇటీవలే 3 కార్పొరేషన్లుగా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించాం. హైడ్రా ద్వారా రూ.60వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం. 23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ.1700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. జీసీసీలలో 20 శాతం ఆతిథ్యం ఇస్తూ హైదరాబాద్ గ్లోబల్ టెక్ హబ్‌గా మారింది. ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ కొనసాగుతోంది. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ రంగం 9.39లక్షల ఉద్యోగాలు కల్పిస్తోంది. కొడంగల్ ప్రాంతం పారిశ్రామికవాడగా మారబోతోంది. అని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

### రైతులకు భరోసా

గతేడాది వానాకాలంలో రైతుభరోసా కింద రూ.8,744 కోట్లు ఇచ్చాం. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేశాం. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా 15.12లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయి. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఈగల్ ప్రత్యేక బృందం ద్వారా డ్రగ్స్‌సమస్యను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. టీజీపీఎస్సీ, ఇతర నియామక బోర్డులను సంస్కరించాం. రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాలను భర్తీ చేశాం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం" అని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

### తెలుగులో ప్రారంభించి.. హిందీలో కొనసాగించి...

రాష్ట్రం ఏర్పడిన తర్వాత బడ్జెట్ సెషన్‌లో తొలి సారి గవర్నర్ ప్రసంగం హిందీలో సాగింది. ఇప్పటివరకు గవర్నర్‌లుగా వ్యవహరించిన ఈఎస్ఎల్ నర్సింహన్, తమిళిసై సౌందర్‌రాజన్, జిష్ణుదేవ్ వర్మ తదితరులంతా ఇంగ్లీషులోనే ప్రసంగించారు. కానీ కొత్తగా వచ్చిన శివప్రతాప్ శుక్లా మాత్రం తెలుగులో ప్రారంభించి తెలుగులోనే ప్రసంగాన్ని ముగించారు. మధ్యలో స్పీచ్ అంతా హిందీలోనే కొనసాగించారు. ఇంగ్లీష్ భాషపై పట్టు ఉన్నా ఆయన హిందీలోనే ప్రసంగించి తన రూటు సెపరేటు అని చాటారు.

## 20న బడ్జెట్

- 31 దాకా అసెంబ్లీ సమావేశాలు
- బీఏసీలో నిర్ణయం

02






## మీడియాతో చిట్‌చాట్‌లు వద్దు

- సభ్యులంతా సభకు రావాల్సిందే
- మీ నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఆరుగురు ఎమ్మెల్యేల గైర్హాజరుపై సీరియస్

వివరాలు 2లో



కాంగ్రెస్ మునిగిపోయే పడవ

## ఆ పార్టీలో చేరేది లేదు

పార్టీ మార్పుపై మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి క్లారిటీ

వివరాలు 2లో



అంగరంగ వైభవంగా

# ఆస్కార్ పురస్కారం

98వ అకాడమీ చలనచిత్ర పురస్కారాల ప్రధానోత్సవం


ప్రత్యేక ఆకర్షణగా ప్రియాంక చోప్రా మెరుపులు

వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ చిత్రానికే పెద్ద పీట

ఉత్తమ నటుడిగా మైఖేల్ బి జోర్డాన్, నటిగా జెస్సీ బక్లీ

లాస్ ఏంజెల్స్ నగరంలో అట్టహాసంగా పురస్కారాల పండుగ

సినర్స్ చిత్రానికి 16 విభాగాల్లో అగ్రస్థానం



**మహా :** అమెరికాలోని లాస్ ఏంజెల్స్ నగరంలో ఉన్న డాల్బీ థియేటర్ వేదికగా 98వ అకాడమీ పురస్కారాల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఈ వేడుకను అమెరికా కాలమానం ప్రకారం 2026 మార్చి 15వ తేదీ ఆదివారం రాత్రి అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16వ తేదీ సోమవారం ఉదయం ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కాగా దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఈ పండుగను వీక్షించారు. ప్రఖ్యాత హాస్య నటుడు కోనన్ ఓబ్రియన్ వరుసగా 2వ సంవత్సరం ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి తనదైన శైలిలో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ఎన్నో అద్భుతమైన చిత్రాలు ఈసారి పోటీలో నిలవగా విశ్వ చలనచిత్ర తారల సమక్షంలో ఈ పురస్కారాల ప్రదానం సాగింది.

మిగతా 2లో




# తెలంగాణలో అకాల వర్షాల బీభత్సం

## వడగండ్ల వానతో వణికిన జిల్లాల ప్రజలు

కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు

వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక

మరో నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలే.. 17 జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్

ప్రకృతి పగతో చేతికొచ్చిన వరి, మిర్చి, మొక్కజొన్నకు అపార నష్టం

అకాల వర్షాలతో అతలాకుతలమైన తెలంగాణ వ్యవసాయం, దిక్కుతోచని స్థితిలో రైతన్న



**హైదరాబాద్, మహా:** ఎండల తీవ్రతతో అల్లాడుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని అకాల వర్షాలు, వడగండ్ల వానలు ఒక్కసారిగా వణికించాయి. ద్రోణి ప్రభావంతో వాతావరణం అమాంతం చల్లబడటమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భీకరమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి.

మిగతా 2లో

మీరు కాల్చేయండి

# నేను చూసుకుంటా..

## పోలీసుల్ని చంపి.. తప్పించుకోవాలనుకున్నారా?

రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు



**హైదరాబాద్, మహా :** మొయినాబాద్‌లో వెలుగు చూసిన డ్రగ్స్ పార్టీ ఉదంతం ఇప్పుడు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మార్చి 14, 2026 రాత్రి అజీజ్ నగర్ విలేజ్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ ప్రైవేట్ పార్టీలో డ్రగ్స్ వినియోగంతో పాటు కాల్పులు జరపడంపై కేసులు నమోదయ్యాయి.

### డ్రగ్స్ తీసుకు వచ్చిన కౌశిక్ రవి

పోలీసుల నివేదిక ప్రకారం, ఈ కేసులో నిందితుడైన కౌశిక్ రవి తన బిజినెస్ ట్రిప్‌లో

మిగతా 2లో

## ఫ్రెండ్ అని పిలిచి కత్తితో వేటాడి

- మర్డర్ జరిగిన 6 గంటల్లోనే నిందితుడి అరెస్టు
- ఉప్పల్ పోలీసుల 'మెరుపు' ఆపరేషన్
- ఫోన్ ఎత్తలేదన్న చిన్న గొడవతోనే ఘోరం



వివరాలు 2లో



## 20న బడ్జెట్ 31 దాకా

# అసెంబ్లీ సమావేశాలు

### బీఏసీలో నిర్ణయం

**హైదరాబాద్, మహా:** ఈ నెల 20న అసెంబ్లీలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ నెల 23, 24, 25, 26 తేదీల్లో బడ్జెట్‌పై సాధారణ చర్చ, పద్దులపై చర్చ జరగనుంది. రేపు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈ నెల 31 అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తుంది. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, హరీశ్‌రావు, కేపీ వివేకానందగౌడ్, బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ (ఎంఐఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ) పాల్గొన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై చర్చించారు. ఆదివారాలు కూడా సమావేశాలు కొనసాగించాలని ఇతర పార్టీల అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఉగాది, రంజాన్, శ్రీరామనవమి మినహా అన్ని రోజులు నడపాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు.

**నిరసనకు కూడా అవకాశం ఇవ్వాలి**

బీఏసీ సమావేశం అనంతరం పలువురు నేతలు మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభోత్సవానికి తమని ఆహ్వానించలేదని హరీష్ రావు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు 30 వరకు నిర్వహిస్తామని అన్నారని, అందులో ఐదు సెలవులు ఉన్నాయని, ఆరు, ఏడు పని దినాలు కూడా ఉండవని, సమావేశాలు పొడిగించాలని అడిగామని అన్నారు. 31 వరకు నిర్వహించాలని, అవసరమైతే ఆదివారాలు కూడా పెట్టాలని అడిగామని, సీఎంతో మాట్లాడి చెబుతామని అన్నారని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతుంటే మంత్రులు పదేపదే అడ్డుపడుతున్నారని చెప్పామని, సీఎం, సంబంధిత మంత్రి, శాసనసభా వ్యవహారాల మంత్రి తప్ప ఇతరులు జోక్యం చేసుకోకుండా చూడాలని కోరామని, చేస్తానని స్పీకర్ చెప్పారని, పాయింట్ ఆఫ్ ఆర్డర్, నిరసనకు కూడా అవకాశం ఇవ్వాలని అడిగామని, ఇస్తామని స్పీకర్ చెప్పారని అన్నారు. ఆరు గ్యారెంటీలపై ప్రైవేట్ బిల్లు పెడతామని, అనుమతించాలని కోరామని, బీఆర్ఎస్‌కు తక్కువ సమయం ఇస్తున్నారని, బీఏసీలో తీసుకున్న నిర్ణయాలు కాకుండా మినిట్స్‌లో వేరే పెడుతున్నారని వాటిని కనీసం పట్టించుకోవడం లేదని గుర్తు చేశామని అన్నారు. బీఏసీ నిర్ణయాలు అమలు చేయకపోతే తర్వాత సమావేశాన్ని బాయ్ కాట్ చేస్తామని చెప్పామని అన్నారు.

## మీరు కాల్చేయండి

# నేను చూసుకుంటా..

### పోలీసుల్ని చంపి.. తప్పించుకోవాలనుకున్నారా?

### రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాకు వెళ్లినప్పుడు, అక్కడ ఒక అపరిచిత వ్యక్తి నుంచి రూ. 15,000 వెచ్చించి కొకైన్‌ను కొనుగోలు చేశాడు. దానిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఫామ్‌హౌస్ పార్టీలో తన స్నేహితులకు పంచాడు. తిరువీధుల అర్జున్ రెడ్డి, పంజుగుల రితేష్ రెడ్డి, నితేష్ శర్మ, పంజుగుల రోహిత్ రెడ్డిలు ఈ కొకైన్‌ను సేవించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. నిందితులకు నిర్వహించిన యూరిన్ టెస్టుల్లో కొకైన్ ఆనవాళ్లు ఉన్నట్లు పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది.

**పోలీసులపై కాల్పుల**

కేసులో అత్యంత భయానకమైన అంశం పోలీసులు ఫామ్‌హౌస్‌పై దాడి చేసిన సమయంలో నిందితుల్లో ఒకరైన నమిత్ శర్మ పోలీసులపైకి కాల్పులు జరపడం. రిమాండ్ రిపోర్ట్ ప్రకారం, పోలీసుల రాకను గమనించిన నమిత్ శర్మ, రితేష్ రెడ్డికి చెందిన రివాల్వర్‌ను తీసుకుని పోలీసులను భయపెట్టి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ఒక రౌండ్ కాల్పులు జరిపారు. ఇది పోలీసుల ప్రాణాలకు ముప్పు కలిగించడమే కాకుండా, విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకోవడంగా పోలీసులు పరిగణించారు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

ఘటనా స్థలంలో పోలీసులు జర్మనీ తయారీ రివాల్వర్, ఖాళీ తూటాలు, ఒక లైవ్ బుల్లెట్, 0.26 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు భారీగా విదేశీ మద్యం సీసాలను కూడా సీజ్ చేశారు. కింగ్ ఫిషర్ అల్ట్రా బీర్లు, రాయల్ సెల్యూట్ 21 ఇయర్స్ విస్కీ, చివాస్ రీగల్, వోడ్కా వంటి ఖరీదైన మద్యం బాటిళ్లను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**నిందితుల వివరాలు**

ఈ కేసులో మొత్తం 11 మందిని నిందితులుగా చేర్చారు. ఇందులో వ్యాపారవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, అడ్వకేట్లు ఉన్నారు. ఏ1గా నమిత్ శర్మ (ఢిల్లీ), ఏ2గా రోహిత్ రెడ్డి, ఏ3గా రితేష్ రెడ్డి సహా మొత్తం 11 మందిపై ఎన్డీపీఎస్ చట్టంతో పాటు ఆర్మ్స్ యాక్ట్, తెలంగాణ ఎక్సైజ్ చట్టం, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# నందిని సిద్ధారెడ్డికి

# కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

### హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కవి, ఉద్యమకారుడు, రచయిత నందిని సిద్ధారెడ్డికి అరుదైన గౌరవం లభించింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రకటించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లో నందిని సిద్ధారెడ్డికి కూడా ఈ గౌరవం కల్పించింది. కరోనా కాలంలో నెలకొన్న పరిస్థితులను నందిని సిద్ధారెడ్డి.. కళ్లకు కట్టినట్లు ఆయన అనిమేష కవితా సంపుటి రాయగా దానికి ఈ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సాహిత్య అకాడమీ ఛైర్మన్‌గా నందిని సిద్ధారెడ్డిని నియమించడం విశేషం. కరోనా సమయంలో సామాజిక పరిస్థితులు, మానవీయ కోణాలను ఆయన ఈ అనిమేష కవితా సంపుటిలో చిత్రించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించిన వారికి రూ. లక్ష నగదు ప్రోత్సాహంతోపాటు.. తామ్రపత్రం, శాలువాను కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తుంది. 1955లో మెదక్ జిల్లా బందారం గ్రామంలో నందిని సిద్ధారెడ్డి పుట్టారు. ఆయన తండ్రి నర్రా బాలసిద్ధారెడ్డి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఒక గొప్ప కమ్యూనిస్టు యోధుడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తిచేసిన నందిని సిద్ధారెడ్డి ‘ఆధునిక తెలుగు కవిత్వంలో సూర్యుడు’ అనే అంశంపై 1981లో ఎంఫిల్ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత ‘ఆధునిక కవిత్వం, వాస్తవికతఅధివాస్తవికత’ పై పరిశోధనలకు గానూ 1986 పీహెచ్‌డీ పట్టా వరించింది.



**తెలంగాణకు గర్వకారణం- సీఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి రాసిన “అనిమేష” కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజం పట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**నందిని సిధారెడ్డి.. తెలంగాణ గర్వించదగ్గ కవి: కేసీఆర్**

ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డిని అభినందిస్తూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

**మాజీ మంత్రి కేటీఆర్ హర్షం**

నందిని సిద్ధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని ప్రకటించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నందిని సిద్ధారెడ్డికి శుభాకాంక్షలు చెబుతూ కేటీఆర్ ట్వీట్ పెట్టారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ నందిని సిద్ధారెడ్డికి ఈ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం యావత్ తెలంగాణ రాష్ట్రానికే చాలా గర్వకారణమని కేటీఆర్ కొనియాడారు. 'తెలంగాణ మట్టి సువాసనను, ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో విశ్వవ్యాప్తం చేసిన ప్రముఖ కవి, సాహితీవేత్త శ్రీ నందిని సిద్ధారెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం అత్యంత సంతోషదాయకం. ఇది తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవం. వారికి నా హృదయపూర్వక అభినందనలు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# కాంగ్రెస్ మునిగిపోయే పడవ

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ అని, ఆ పార్టీలో నేనెందుకు చేరుతానని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గత కొన్నాళ్ళుగా మల్లారెడ్డి పార్టీ మార్పుపై జోరుగా ఊహాగానాలు గుప్పుమంటున్నాయి. ఆయన కారు దిగి హస్తం పార్టీలో చేరుతారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీతో మల్లారెడ్డి కుటుంబం సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. తన కుటుంబ రాజకీయ భవిష్యత్ కోసం.. మల్లారెడ్డి పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో తాజాగా మల్లారెడ్డి స్వయంగా స్పందించి ఈ ఊహాగానాలకు తెరదించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, అవన్నీ అసత్యాలేనని కొట్టిపారేశారు. ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తనకు తెలుసని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన మల్లారెడ్డి.. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న ఊహాగానాలను కొట్టేశారు. ప్రస్తుతం తన వయసు 73 ఏళ్లు అని.. ఏ నిర్ణయం తీసుకోవాలో తనకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మునిగిపోయే పడవలో ఎవరైనా ఎక్కుతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ 11 ఏళ్లు కాకుండా 50 ఏళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ అది మునిగిపోయే పడవనే అని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏ పార్టీ బలంగా ఉందో అందరికీ తెలుసని అన్నారు. ఇటీవలె తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశానని, తన పెళ్లిరోజు వేడుకలకు రావాలని ఆయనను ఆహ్వానించినట్లు మల్లారెడ్డి స్పష్టం చేశారు.

**మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి వ్యాఖ్యలు వైరల్**

మరోవైపు.. మల్లారెడ్డి చిన్న కుమారుడు భద్రారెడ్డి సతీమణి.. మల్లారెడ్డి విద్యాసంస్థలను చూసుకుంటున్న ప్రీతిరెడ్డి ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మార్చాలంటూ ఆమె ఒక డిమాండ్‌ను తెరపైకి తీసుకువచ్చారు. అదే సమయంలో గత కొంతకాలంగా మేడ్చల్ నియోజకవర్గంలో చాలా యాక్టివ్‌గా ఉంటున్న ప్రీతి రెడ్డి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రశంసలు గుప్పించడం గమనార్హం. మరీ ముఖ్యంగా నూతన జాతీయ విద్యా విధానం ద్వారా భారతదేశ విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులు.. ఆర్థిక సంస్కరణలు, మహిళా సాధికారత వంటి వాటిపై ఆమె కేంద్రంపై పొగడ్తల వర్షం కురిపించారు. వీటన్నింటితోపాటు గతంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌తో ప్రీతిరెడ్డి భేటీ కావడం అప్పట్లోనే తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అంతే కాకుండా ఆమె రాజకీయాల్లోకి రావాలని ఉందని.. ఎంపీ పదవిపై ఆసక్తి ఉందని పేర్కొనడం గమనార్హం.

## ఏఐసీసీ సంచలన నిర్ణయం

- తెలంగాణలో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు
- కమిటీలో సీఎం, పీసీసీ చీఫ్ తో పాటు ఉత్తమ్, దామోదర, సీతక్క

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ హైకమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. 8మంది సభ్యులతో సమన్వయ కమిటీని సోమవారం రాత్రి ప్రకటించింది. ఈ కమిటీలో సభ్యులుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, సీతక్క, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులుగా చల్లా వంశీచంద్ రెడ్డి, ఎఐసిసి తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఉండనున్నారు. ఈ కమిటీ పార్టీ సంస్థాగత వ్యవహారాలు మరియు తెలంగాణ ప్రభుత్వం మధ్య సమర్థవంతమైన సమన్వయం కోసం పనిచేయనుందని ఏఐసీసీ ప్రకటించింది.

## విజయ్ ఇంత టార్గెటా?

**మహా:** హే..భగవాన్. కేంద్రం, సీఈసీ మరీ ఇంతలా పగబట్టాలా? అని విజయ్ అభిమానులు వాపోతుండగా, రాజకీయ పండితులే విజయ్ ను టార్గెట్ చేసిన తీరు చూసి విస్తుపోతున్నారు. ప్రస్తుతం తమిళ స్టార్ హీరో విజయ్ వ్యక్తిగత జీవితం, రాజకీయ ప్రయాణానికి సంబంధించిన కొన్ని కీలక తేదీలు నెటిజన్లలో ఇటువంటి చర్చకే దారి తీస్తున్నాయి. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య విడాకుల కేసు విచారణ ఏప్రిల్ 20న జరగనుందని తెలుస్తోంది. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు వినవస్తున్నా, అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. సరిగ్గా ఇదే సమయంలో ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్, ఈ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగుతుండటంతో ఈ సమయం ఆయన కెరీర్‌కు అత్యంత కీలకంగా మారింది. వ్యక్తిగత సమస్యలు, రాజకీయ సవాళ్లు ఒకేసారి ఎదురవుతున్నాయి. మరోవైపు, నటి త్రిష కృష్ణన్‌తో విజయ్ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు సినీ వర్గాల్లో ఒక రేంజ్ లో వినిపిస్తున్నాయి. తమిళనాడు ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. అదే రోజు త్రిష కృష్ణన్ పుట్టినరోజు కూడా కావడం విశేషం. ఈ యాదృచ్ఛికాన్ని చూసి కొందరు నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఈ టైమింగ్‌పై ఆసక్తికరమైన కామెంట్లు చేస్తున్నారు. వాట్ ఏ ప్లానింగ్ అంటూ సెంట్రల్ పై సెటైర్లు వేస్తున్నారు. కేంద్రం, సీఈసీ కావాలని ఇవి ఫిక్స్ చేశాయని, పార్టీ పెట్టిన నాటినుండీ ఎదురైన సవాళ్ళన్నీ చూస్తున్న ప్రజలు విజయ్ పై సానుభూతి ప్రకటిస్తున్నారు.

## అంగరంగ వైభవంగా

# ఆస్కార్ పురస్కారం


(మొదటిపేజీ తరువాయి)

పురస్కారాల వేడుకలో గ్లోబల్ నటి ప్రియాంకచోప్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**ఆరు పురస్కారాలు**

ఈ ఏడాది పురస్కారాల ప్రదానోత్సవంలో దర్శకుడు పాల్ థామస్ ఆండర్సన్ తెరకెక్కించిన వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ చలనచిత్రం సంచలనం సృష్టించింది. ఈ చిత్రం ఏకంగా 6 పురస్కారాలను తన ఖాతాలో వేసుకుని అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉత్తమ చిత్రం విభాగంలో ఈ సినిమా విజేతగా నిలవడమే కాకుండా పాల్ థామస్ ఆండర్సన్‌కు ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని సైతం తెచ్చిపెట్టింది. ఉత్తమ నటీనటుల ఎంపిక విభాగంలో తొలిసారిగా ఇస్తున్న పురస్కారం కూడా ఈ చిత్రానికే దక్కడం విశేషం. దర్శకుడు రయాన్ కూగ్లర్ రూపొందించిన సినర్స్ చిత్రం 16 విభాగాల్లో పోటీకి ఎంపికై అకాడమీ చరిత్రలోనే సరికొత్త ఘనతను నెలకొల్పింది. అత్యధిక స్థానాల్లో పోటీ పడిన ఈ చిత్రం చివరకు 4 పురస్కారాలను కైవసం చేసుకుని తన సత్తాను నిరూపించుకుంది. ఉత్తమ నటీనటుల విభాగంలో ఈసారి గట్టి పోటీ నెలకొన్నప్పటికీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన తారలకే పురస్కారాలు దక్కాయి. సినర్స్ చిత్రంలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసిన మైఖేల్ బి జోర్డాన్ ఉత్తమ నటుడిగా అత్యున్నత పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారం దక్కడం ఆయనకు ఎంతో ఆనందాన్నిచ్చింది. హ్యామ్నెట్ చిత్రంలో అద్భుతమైన భావోద్వేగాలను పండించిన జెస్సీ బక్లీ ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకున్నారు. వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ చిత్రంలో అద్వితీయమైన నటన కనబరిచిన సీన్ పెన్ ఉత్తమ సహాయ నటుడిగా ఎంపికయ్యారు. వెపన్స్ చిత్రంలో దశాబ్దాల అనుభవాన్నంతా రంగరించి నటించిన అమీ మాడిగన్ ఉత్తమ సహాయ నటి పురస్కారాన్ని అందుకుని అందరి మన్ననలు పొందారు. అంతర్జాతీయంగా ఎన్నో అద్భుత దృశ్యకావ్యాలు పోటీ పడినప్పటికీ నార్వే దేశానికి చెందిన సెంటిమెంటల్ వాల్యూ ఉత్తమ అంతర్జాతీయ చిత్రంగా పురస్కారాన్ని సొంతం చేసుకుంది. సాంకేతిక విభాగాల్లో పలు





చిత్రాలు విశేషమైన విజయాలను సొంతం చేసుకున్నాయి. ఉత్తమ అలంకరణ, నిర్మాణ రూపకల్పన లాంటి విభాగాల్లో ఫ్రాంకెన్‌స్టీన్ చిత్రం పురస్కారాలను గెలుచుకుంది. వాస్తవిక చిత్రాల విభాగంలో మిస్టర్ నోబడీ ఎగైనెస్ట్ పుతిన్ ఉత్తమ వాస్తవిక చిత్రంగా పురస్కారం సాధించగా ఆల్ ద ఎంప్టీ రూమ్స్ ఉత్తమ లఘు వాస్తవిక చిత్రంగా నిలిచింది. ఈ వేడుకల్లో భారతదేశానికి నేరుగా పురస్కారాలు దక్కకపోయినప్పటికీ భారతీయ ప్రాతినిధ్యం ఆకట్టుకుంది. ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా ఈ ప్రతిష్టాత్మక వేదికపై పురస్కార ప్రదాతగా వ్యవహరించి భారతీయులందరూ గర్వించేలా చేశారు. గతించిన సినీ ప్రముఖులను స్మరించుకునే విభాగంలో భారతీయ దిగ్గజాలకు ఘన నివాళులు అర్పించారు. ప్రఖ్యాత నటులు ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి సరోజా దేవి, కోట శ్రీనివాసరావు లాంటి దిగ్గజాల చిత్రాలను ఈ వేదికపై ప్రదర్శించి అకాడమీ వారు తమ అపారమైన గౌరవాన్ని చాటుకున్నారు. కళ్లు చెదిరే వేదిక అలంకరణలు, అద్భుతమైన ప్రదర్శనలతో ముగిసిన ఈ 98వ అకాడమీ పురస్కారాల వేడుకలు చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతాయి.

**పురస్కారాలు సాధించిన చిత్రాల వివరాలు**

- వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ (ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు సహా మొత్తం 6 అవార్డులు)
- సినర్స్ (ఉత్తమ నటుడు, ఒరిజినల్ స్క్రీన్ ప్లే సహా మొత్తం 4 అవార్డులు)
- హ్యామ్నెట్ (ఉత్తమ నటి)
- వెపన్స్ (ఉత్తమ సహాయ నటి)
- సెంటిమెంటల్ వాల్యూ (ఉత్తమ అంతర్జాతీయ చిత్రం)
- ఫ్రాంకెన్‌స్టీన్ (ఉత్తమ మేకప్, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్)
- మిస్టర్ నోబడీ ఎగైనెస్ట్ పుతిన్ (ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్)
- ఆల్ ద ఎంప్టీ రూమ్స్ (ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్)
- ఎఫ్ వన్ (బెస్ట్ సౌండ్ డిజైన్)
- కేపాప్ డెమన్ హంటర్స్ (ఉత్తమ యానిమేటెడ్ చిత్రం)

## ఫ్రెండ్ అని పిలిచి ... కత్తితో వేటాడి

**హైదరాబాద్, మహా :** నగరంలో హత్య జరిగిన కొద్ది గంటల్లోనే నిందితుల అడ్రస్ కనిపెట్టి.. వారి చేతులకు బేడీలు వేయడంలో ఉప్పల్ పోలీసులు తమ మార్కు స్పీడ్ చూపించారు. చిలకానగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన దారుణ హత్య కేసులో పోలీసులు మెరుపు వేగంతో స్పందించారు. కేవలం 6 గంటల వ్యవధిలోనే హంతకులను పట్టుకుని ‘శాంతిభద్రతల రక్షణలో తాము ఎప్పుడూ అలర్ట్’ అని నిరూపించుకున్నారు.

**అసలేం జరిగిందంటే..?**

పోలీసుల వివరాల ప్రకారం.. బానోతు సంతోష్, పొడిశెట్టి తరుణ్, మృతుడు సుధీర్ కుమార్ ముగ్గురూ పాత దోస్తులు. మూడు రోజుల క్రితం సుధీర్ తన బావ ఇంటి గృహప్రవేశానికి వీరిని పిలిచాడు. అయితే ఫంక్షన్ రోజున సంతోష్ చేసిన ఫోన్ కాల్స్‌ను సుధీర్ రిసీవ్ చేసుకోలేదు. "నన్ను పిలిచి.. నా ఫోన్ ఎత్తవా?" అన్న అహంకారం సంతోష్‌లో సెగలు పుట్టించింది. ఇదే విషయంపై వాట్సాప్‌లో తిట్టుకున్నారు. ఆదివారం రాత్రి 7:30 గంటలకు ‘మాట్లాడుకుందాం రా’ అని సుధీర్‌ను చిలకానగర్ గ్రౌండ్‌కు పిలిచారు. అక్కడ మాటా మాటా పెరగడంతో ముందే ప్లాన్ చేసుకున్న సంతోష్.. కత్తి తీసి సుధీర్‌ను పొడిచాడు. ప్రాణ భయంతో సుధీర్ రోడ్డుపైకి పరుగులు తీసినా వదలకుండా వెంటాడి, వేటాడి కత్తులతో పొడిచి చంపేశారు.

**పోలీసుల ‘సింగం’ స్టైల్ ఆపరేషన్**

రాత్రి 10:30 గంటలకు ఫిర్యాదు అందడమే ఆలస్యం. ఉప్పల్ పోలీసులు యాక్షన్ మోడ్‌లోకి వెళ్లారు. మల్కాజిగిరి డీసీపీ కె. సురేష్ కుమార్ నేతృత్వంలో అదనపు డీసీపీలు వెంకటరమణ, నర్సింహారెడ్డి పర్యవేక్షణలో స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. టెక్నికల్ గ్రిడ్ను ఉపయోగించి నిందితుల ఫోన్ సిగ్నల్స్, సీసీటీవీ ఫుటేజీలను క్షణాల్లో జల్లెడ పట్టారు. నిందితులు ఎక్కడ దాక్కున్నారో పక్కా సమాచారంతో తెల్లవారుజామున 4 గంటలకల్లా వారిని చుట్టుముట్టారు. హత్యకు వాడిన కత్తితో పాటు, వారు పారిపోయేందుకు వాడిన యాక్టివా బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**ఆఫీసర్లకు హ్యాట్సాఫ్!**

సాధారణంగా హత్య కేసుల్లో నిందితులు పారిపోయి ఇతర రాష్ట్రాలకు లేదా జిల్లాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. కానీ, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ వై. రామలింగారెడ్డి, ఎస్ఓటి ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ మరియు వారి బృందం కంటిమీద కునుకు లేకుండా శ్రమించి రికార్డు టైంలో కేసును ఛేదించారు. పోలీసుల ఈ వేగవంతమైన పనితీరుపై స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. నేరం చేస్తే తప్పించుకోవడం అసాధ్యమని ఈ అరెస్టుతో పోలీసులు మరోసారి హెచ్చరించారు.

## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్ బై?

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలు తొలగింపు
- జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం

**జగిత్యాల, మహా :** జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలు తొలగింపు చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలను జీవన్‌రెడ్డి అనుచరులు సోమవారం తొలగించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో జీవన్‌రెడ్డికి విభేదాలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని జీవన్‌రెడ్డి కొద్ది కాలంగా అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్‌లో తనకు ప్రాధాన్యం దక్కట్లేదని ఆయన పలుమార్లు బహిరంగంగానే విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా తన పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడంతో చర్చనీయాంశంగా మారింది. ఆయన పార్టీని వీడుతున్నారని వార్తలు వచ్చినా జీవన్ రెడ్డి ఎక్కడా స్పందించడం లేదు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పాలని డిసైడయినట్లు తెలుస్తోంది. ఈనెల 25న ఆయన బీఆర్ఎస్ లో చేరే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి బుజ్జగింపుయత్నాలు చేయగా, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా జీవన్ రెడ్డిని పలుమార్లు బుజ్జగించారు.



**జీవన్ రెడ్డితో కలిసి పనిచేస్తా..**

మాజీమంత్రి జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి వెళ్లిపోవాలనట్లేదని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. జీవన్‌రెడ్డితో కలిసి పని చేయాలనుకుంటున్నానని, జీవన్‌రెడ్డి ఆలోచన ఏముందో నాకు తెలియదని పేర్కొన్నారు.

## మీడియాతో చిట్‌చాట్‌లు వద్దు

- సభ్యులంతా సభకు రావాల్సిందే
- మీ నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఆరుగురు ఎమ్మెల్యేల గైర్హాజరుపై సీరియస్

**హైదరాబాద్, మహా :** శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా? అని ప్రశ్నించారు. మీడియాతో చిట్ చాట్ లు చేయవద్దన్నారు. ఇక మీదట మీ నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి.. ఇంకా వైఫల్యాలను గత ప్రభుత్వం మీద వేయొద్దు.. ప్రజలకు మీమీద ఉన్న అంచాలను అందుకోవాలి.. ఫలితాలు చూపాలి అని సీఎం నిర్దేశించారు.

**నిర్లక్ష్యం వద్దు..**

అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని సీఎం ఆదేశించారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని, సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని, ఇది మన ప్రభుత్వమని, ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్ నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుందని స్పష్టం చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని ఆదేశించారు.

# తెలంగాణలో అకాల వర్షాల బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

మండువేసవిలో ఎండల నుంచి ఉపశమనం లభించినా, ఆకస్మికంగా కురుస్తున్న రాళ్ల వర్షం (వడగండ్లు) పల్లె, పట్టణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మరోవైపు ఈ అకాల విపత్తు చేతికొచ్చిన పంటలను నాశనం చేస్తుండటంతో ఆరుగాలం శ్రమించిన రైతన్న కన్నీరుమున్నీరు అవుతున్నాడు.

**పలు జిల్లాల్లో వడగండ్ల బీభత్సం**

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వడగండ్ల వర్షం కురిసింది. అలాగే కామారెడ్డి జిల్లా కేంద్రంలో వీచిన భీకర ఈదురు గాలులు, కురిసిన రాళ్ల వర్షంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఉన్నట్టుండి వాతావరణం మారిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. అటు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంతో పాటు, మెదక్ జిల్లాలోని నర్సాపూర్, శివ్వంపేట తదితర ప్రాంతాల్లో బలమైన గాలి దుమారంతో కూడిన వర్షం స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేసింది.

**గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు.. ఐఎండీ ఎల్లో అలెర్ట్**

రాబోయే రెండు గంటల్లో మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో గంటకు 41 నుంచి 61 కిలోమీటర్ల వేగంతో ప్రచండ ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దీనికి తోడు ఆదిలాబాద్, హైదరాబాద్, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని తెలుపుతూ ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. మార్చి 16వ తేదీ నుంచి రానున్న నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని దాదాపు 17 జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు స్పష్టం చేశారు.

**రైతన్న గుండెల్లో గుబులు.. వాణిజ్య పంటలకు అపార నష్టం**

సామాన్యులకు ఈ వర్షాలు కాస్త ఉపశమనం ఇచ్చినా, వ్యవసాయ రంగానికి మాత్రం కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. కళ్లెదుటే చేతికొచ్చిన యాసంగి పంటలు నేలపాలు అవుతుండటంతో రైతులు తలపట్టుకుంటున్నారు. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు గాలి వానకు నేలకొరుగుతోంది. వరి కంకులు తడిసిపోయి గింజలు రంగు మారుతుండటంతో, మొలకలు వచ్చి మార్కెట్‌లో మద్దతు ధర రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇక ప్రధాన వాణిజ్య పంటైన మిర్చి (ఎర్ర బంగారం) పరిస్థితి దయనీయంగా మారింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి వర్షానికి తడిసి బూజు పడుతుండటం, రంగు కోల్పోతుండటం రైతును నిలువునా ముంచుతోంది. వడగండ్ల దెబ్బకు చెట్టుకున్న కాయలు సైతం రాలిపోవడం వల్ల దిగుబడి దారుణంగా పడిపోనుంది.

**మొక్కజొన్న, పుచ్చకాయ రైతుల ఆశలు గల్లంతు**

బలమైన ఈదురుగాలుల ధాటికి ఎదుగుదల దశలో లేదా కండెలు తయారవుతున్న దశలో ఉన్న మొక్కజొన్న దంటు (కాండం) మధ్యకే విరిగిపోతోంది. ఆకులు చిరిగిపోయి, కండెలు దెబ్బతిని పంట పూర్తిగా దెబ్బతింటోంది. ఇక వేసవి కాలంలో అత్యధిక డిమాండ్ ఉండే పుచ్చకాయ పంటకు సైతం వడగండ్ల వాన తీవ్ర నష్టాన్ని మిగులుస్తోంది. రాళ్ల వానకు పక్వానికి వచ్చిన కాయలు పగిలిపోవడం, వర్షపు నీరు నిలిచిపోయి కుళ్లిపోవడం జరుగుతోంది. అదనపు తేమ పెరగడం వల్ల కాయల్లోని తీపితనం తగ్గిపోయి వ్యాపారపరంగా రైతులు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది.వాతావరణం ఏమాత్రం అనుకూలించని ఈ విపత్కర పరిస్థితుల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కల్లాల్లో ఉన్న పంటలను కాపాడుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లను సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# పీకేఓసి డిప్ సైడ్ గని సింగరేణికే కేటాయించాలి

**మణుగూరు ఏరియాలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆందోళన.. మేనేజర్ అప్పారావుకు వినతి..**



**మణుగూరు, మహా :** సింగరేణి పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని, పీకేఓసి డిప్ సైడ్ గనిని సింగరేణికే కేటాయించాలని కోరుతూ మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సోమవారం మణుగూరు ఏరియా పీకేఓసి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కదం తొక్కారు. సింగరేణిని పరిరక్షించాలి, పీకేఓసి డిప్ సైడ్ గని సింగరేణికే కేటాయించాలి, ప్రైవేటీకరణ వద్దు వంటి నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగించారు.అనంతరం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గని మేనేజర్ (ఆపరేషన్స్) వి అప్పారావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీకేఓసి డిప్ సైడ్ గనిలో సుమారు 181 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ గని ద్వారా సంస్థకు ప్రతి ఏడాది రూ.1500 కోట్లకు పైగా లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. మణుగూరు ప్రాంత మనుగడకూ, సింగరేణి సంస్థ పరిరక్షణకూ ఈ గని కేటాయింపు అత్యంత కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి గని కేటాయింపులో అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని ప్రస్తావించి చర్చించాలని కోరారు.ఇకపోతే కారుణ్య నియామకాల ప్రక్రియను కొనసాగించాలని, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని, కార్మికుల సొంత ఇంటి కలను నిజం చేసే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.డి నాసర్ పాషా కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు షేక్ అబ్దుల్ రవూఫ్, ఏఐటీయూసీ నాయకులు ఎస్ కుమారస్వామి, రవి, సీఐటీయూ నాయకులు వి వెంకటరత్నం, లక్ష్మణరావు, హెచ్ఎంఎస్ నాయకులు షేక్ మస్తాన్, దరిసా రమేష్, ఐఎఫ్‌టీయూ నాయకుడు అంగోత్ మంగీలాల్, ఐఎన్ టియుసి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య, కార్మిక నాయకులు సయ్యద్ నయమత్ హుస్సేన్, బుర్ర వెంకటేశ్వర్లు, జీవరత్నం, సేవా, వాసుల, కుమారస్వామి, ఆర్.ఎం ప్రసాద్, శ్రీధర్, లక్ష్మీనారాయణ, నరేష్ తదితరులు హాజరయ్యారు. రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో కార్మికులు, సూపర్వైజర్లు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు చెల్లించాలి

- జీతాలు రాక అవస్థలు పడుతున్న స్పందించని ప్రభుత్వం
- ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా

**జూలూరుపాడు, మహా:** ఈ గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వేతనలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు రాక నానా అవస్థలు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు గ్రామ పంచాయతీయులకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేయడం, ధ్రువపత్రాల జారీ, ప్రభుత్వ పథకాల దరఖాస్తులతో పాటు, ఎన్నికల విధుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా పని చేశారని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 83 మంది ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారని, సకాలంలో జీతాలు రాక ఆపరేటర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు విడుదల చేయాలని సోమవారం పత్రిక ప్రకటనలో కోరారు.

# యుద్ధం వద్దు.. శాంతియే ముద్దు

**గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా**



**మణుగూరు, మహా :** యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, పెంచిన ఎల్పీజీ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు సోమవారం మణుగూరు ప్రధాన రహదారిలోని సీపీఐ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన.. ధర్నా నిర్వహించారు. ఎర్రజెండాలు చేతబట్టి యుద్ధం వద్దు - శాంతియే ముద్దు, గ్యాస్ ధరలు తగ్గించాలి.. అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. యుద్ధాల కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రాణనష్టం మాత్రమే కాకుండా ఆర్థిక, మానసిక ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశాల ఆధిపత్య పోరాటం వల్ల ప్రపంచ శాంతి భంగం కలుగుతోందని, ఐక్యరాజ్య సమితి వెంటనే జోక్యం చేసుకుని యుద్ధాన్ని నిలిపివేయాలని కోరారు. యుద్ధ ప్రభావంతో దేశంలో గ్యాస్ నిల్వలు తగ్గిపోతుండగా, ఎల్పీజీ ధరలు భారీగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. హాస్టళ్లు, హోటళ్లు కూడా గ్యాస్ కొరతతో మూతపడే పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్తులో చమురు ధరలు పెరిగి పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని ఐక్యరాజ్యసమితి ద్వారా శాంతి చర్చలు జరిపి యుద్ధాన్ని నిలిపివేసే చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి మాట్లాడుతూ గతంలో జరిగిన మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల పర్యవసానాలను ప్రపంచం ఇప్పటికీ అనుభవిస్తోందన్నారు. యుద్ధాలు ప్రపంచ వినాశనానికి దారితీస్తాయని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే జోక్యం చేసుకుని శాంతి చర్చలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యుడు ఎడారి రమేష్, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు తోట రమేష్, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, వి. నాయుడు, మహిళా సమాఖ్య మండల నాయకులు బోలగాని సమ్మక్క, కోడిమెల్ల సుజాత, మాజీ సర్పంచ్ బాడిష సతీష్, అదెర్ల రాములు, బొజ్జ సదానందం, కొత్తపల్లి సీతారాములు, కన్నెబోయిన ప్రసాద్, నోముల రవి, గోపిశెట్టి శివ, బోశెట్టి సంపత్, యాకూబ్, శ్రీకాకుళం వీరమల్లు, ఆర్టీసీ మురళి, రంజిత్, పైడయ్య, రవి, శ్రీను, బాబురావు, వెంకన్న, నరసింహారావు, నరసయ్య, లక్ష్మణ్, సుశీల, అదెర్ల రేణుక, యశోద, రమణ, దేశబోయిన నరేష్, దేశబోయిన సహదేవ్, నోముల రమేష్, పల్లపు వెంకటేశ్వర్లు, నాగరాజు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



# ఇప్పలగుంపు రహదారిలో కూలిన వంతెన

- పునర్నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్..
- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి..

**మణుగూరు, మహా :** మణుగూరు మండలం పగడేరు గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పలగుంపు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో కూలిపోయిన వంతెనను తక్షణమే పునర్నిర్మాణం చేయాలని ఇప్పల గుంపు గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి, ప్రజాదర్బార్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇప్పలగుంపు గ్రామంలో సుమారు 80 గిరిజన కుటుంబాలు గత 50 సంవత్సరాలుగా నివసిస్తూ పోడు వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుంచి పగడేరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి తమకు ఏకైక రవాణా మార్గమని పేర్కొన్నారు. ఈ మార్గం ద్వారానే పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడంతో పాటు గ్రామస్తులు నిత్యావసర వస్తువుల కొనుగోలు, అత్యవసర వైద్య సేవల కోసం రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారిపై ఉన్న వంతెన తీవ్రంగా దెబ్బతిని కుంగిపోయిందని, ప్రస్తుతం రోజురోజుకు మరింత కూలిపోతూ ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వంతెన పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉండడంతో గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి ఇప్పలగుంపు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెనను అత్యవసరంగా పునర్నిర్మాణం చేయాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గిరిజన నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అనాది నుండి ఆచారాలు కొనసాగింపు

**భక్తి, విశ్వాసాలను చాటుతున్న ఆదివాసి నాయక పోడులు**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం లో స్త్రీ శక్తి స్వరూపిణి అయిన పెద్దమ్మ తల్లి కొలుపు కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యింది. కొలుపు అనగా గ్రామదేవతలందరినీ ఒకే చోట చేర్చి మేళ్ల తాళాలతోటి ఆచార సాంప్రదాయంగా పూజించడాన్నే కొలుపు అంటారు. ఇది అనాదిగా శతాబ్దాల కాలం నుండి తరతరాలుగా ఆదివాసి గిరిజన నాయక పోడులు అనుసరిస్తూ, ఆచరిస్తూ, కొనసాగిస్తున్న సాంప్రదాయం. ఈ కొలుపు కార్యక్రమంలో ఆదివాసి నాయక పోడు గిరిజన పూజారులు ప్రధాన పాత్ర పోషిస్తారు. కొలుపు మొదలుకొని ముగింపు వరకు అన్ని కార్యక్రమాలు కటోర నియమనిష్టలతో ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలతో నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి, రాజు గొడుగులు, పోతురాజు, వీర ఖడ్గం, గణబాలలు, దేవరబాలలు, పూనకాల నడుమ గ్రామంలో కొలుపు కార్యక్రమం కోలాహలంగా నిర్వహిస్తారు. కొలుపులో ప్రధానంగా పుట్ట బంగారం, బొడ్రాళ్ళు, కొలబియ్యం, సరువుల ఊరేగింపు, పట్నాలు, కళ్యాణం, కొండాలు తొక్కుట (అగ్నిపునీతం) ప్రధాన ఘట్టాలుగా నిర్వహిస్తారు. ఇలాంటి దైవ కార్యక్రమ నిర్వహణతో గ్రామ ప్రజలు, పశువులు, పంటలు, హానికరమైన వ్యాధులు రాకుండా, అంతా సుభిక్షంగా ఉండే విధంగా అమ్మ చూసుకుంటుందని ఆదివాసీల నమ్మకం. గ్రామంలో కొలుపు ఆఖరి రోజులైనా 21, 22 తారీకులలో అనగా శనివారం వనం (అడవి) నుండి సరువులు (మూడు సంద్ర చెట్లు) ను దేవతలకు ప్రతిరూపాలుగా భావించి గ్రామస్తులంతా కలసి ఊరేగింపుగా నగురు అనగా (దేవతను కూర్చోబెట్టి కొలిచే స్థలం) వద్దకు తీసుకొని వచ్చి వాటిని కాల్చి ఆదివారం ఉదయం ఆ నిప్పురవ్వలపై నడిచి తమ భక్తిని, విశ్వాసాన్ని నిరూపించుకోవడంతో ఈ కొలుపు ఘట్టం ముగిస్తుంది.

## తిరుపతిలో పరశురాం పరివార్ రాజశేఖర్ కు బెస్ట్ సర్వీసు సొసైటీ అవార్డు



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలం సారపాక కు చెందిన పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ కు బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ బహుజన సాహిత్య అకాడమీ (బియస్ఏ) జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ముత్తవరపు రాజశేఖర్ చేస్తున్నా సేవలకు గాను బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరి లో మేము చేస్తున్న సేవలకు గాను మొదటి అవార్డు హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీసు వారి నుండి సేవారత్న అవార్డు పొందాను, ఇప్పుడు రెండో అవార్డు బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు ను బహుజన సాహిత్య అకాడమీ వారి చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది అని, ఎనిమిది సంవత్సరాలుగా మేము చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేసిన బహుజన సాహిత్య అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తు లో ఇంకా మంచి మంచి కార్యక్రమాలు చేస్తాము అని, అందరికీ ఆదర్శంగా నిలుస్తాము అని తెలియజేశారు



పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని

# సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బూర్గంపాడు తహసీల్ ఆఫీస్ ముందు ధర్నా

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండల సమితి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాడు ధర్నా నిర్వహించారు. ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దాడులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. యుద్ధాల వలన దేశంలో పెరిగిన నిత్యవసర వస్తువుల్లో భాగంగా గ్యాస్ ధరను తగ్గించి అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు ఈ ధర్నా సిపిఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరావు జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు అలవాల సీతారామ రెడ్డి మండల సీనియర్ నాయకులు సిద్ధారపు సుబ్బా రెడ్డి ముదిగొండ బాలకృష్ణ బలరాం కూరపాటి దాసు కుంజా నాగరాజ్ సింగబోయిన వెంకటేశ్వర్లు సోయం విజయబాబు కొమరం రాజేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

# నాణ్యత ప్రమాణాలు పాటిస్తే పంటలకు గిట్టుబాటు ధరలు సాధ్యం

- వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ
- వ్యవసాయ అధికారి ఆర్ శంకర్




**బూర్గంపహాడ్ మహా :** రైతులు పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు పొందాలంటే నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని బూర్గంపాడు వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ అన్నారు. సోమవారం బూర్గంపాడు రైతు వేదికలో వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో పాటించాల్సిన శాస్త్రీయ విధానాలు, పంటల సంరక్షణ, ఎరువుల సరైన వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మార్గాలు వంటి అంశాలపై తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్లో పోటీ ఎక్కువగా ఉన్నందున రైతులు నాణ్యతతో కూడిన ఉత్పత్తులను పండించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి ఆర్ శంకర్ మాట్లాడుతూ. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాల వివరాలను రైతులకు వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. పంటల సాగులో నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా మాత్రమే మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవడంతో పాటు ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ రిసోర్స్ పర్సన్సాయి, వ్యవసాయ విస్తరణ అధికారులు శృతి, వైష్ణవి, పవన్, సౌజన్య, రైతులు మారం శ్రీనివాసరెడ్డి, బెల్లంకొండ రామారావు, భజన పెద్ద నాగం పాల్గొన్నారు

# అంజనాపురంలో 11 కేవీ లైన్ వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి



**బూర్గంపహాడ్ మహా :** అంజనాపురం గ్రామంలో నివాస గృహాల మధ్యగా ప్రమాదకరంగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే తొలగించి ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేయాలని రెండో వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ భద్రాచలం ఏడిఈ గారిని కలిసి వినతి పత్రం అందించినారు సోమవారం భద్రాచలం ఏడిఈ ఆఫీస్ కి వెళ్లి గ్రామంలో ఇళ్ల మధ్యగా ఉన్న ఈ హై వోల్టేజ్ విద్యుత్ లైన్ కారణంగా ఎప్పటికప్పుడు ప్రమాద భయం నెలకొన్నదని ఆయన తెలిపారు. గాలి, వర్షాలు వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉండటంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు మరియు వృద్ధులకు ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి గ్రామానికి బయట లేదా రహదారి మార్గం వెంట ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలని ఆయన విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అత్యవసరంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ తెలిపారు విద్యుత్ అధికారులు త్వరలోనే గ్రామాన్ని సందర్శించి దానికి సంబంధించిన ఎస్టిమేషన్లు వేపిచ్చి త్వరగానే ప్రత్యమ్నయ విద్యుత్ లైన్ లో ఏర్పాటు చేస్తామని చెప్పేసి అధికారులు సానుకూలంగా స్పందించినారు స్పందించిన విద్యుత్ అధికారులకు వార్డు మెంబర్ కృతజ్ఞతలు తెలిపినారు

# కార్పొరేట్ల సంపద పెంపుకు కార్మికుల గొంతుకు ఉరిబిగిస్తారా?

- నాలుగు లేబర్ కోడ్లపై అసెంబ్లీ తీర్మానం చేయాలి
- ఐఎఫ్టియు జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతారామయ్య

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఏప్రిల్ ఒకటి నుండి దేశంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని మోడీ ఆదేశాలు ఇవ్వడం కార్మిక వ్యతిరేకమైనదని కార్పొరేట్ల సంపద పెంపుకోసం 145 కోట్ల దేశ ప్రజలకు, 70 కోట్ల కార్మికుల గొంతుకు ఉరితాడు బిగించడానికి సిద్ధంకావడం దుర్మార్గమైనదని ఐ ఎఫ్ టి యు జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతారామయ్యఅన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమనిరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐఎఫ్టియు జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాధినేని వెంకటేశ్వరరావు జె.సీతారామయ్య ప్రసంగించారు. ఎన్నో కార్మిక సమ్మె పోరాటాలు త్యాగాల ద్వారా సాధించుకొని అనుభవిస్తున్న 29కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందని దీని స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గ ప్రయోజనాలకు ఎంత మాత్రం ఉపయోగపడవని కార్మిక వర్గ మనుగడకు హక్కులకు సౌకర్యాలకు సమాధి చేసే ఉద్దేశంతోనే లేబర్ కోడ్లు ఉన్నాయని అన్నారు. వలస కాలం నాటి కార్మిక చట్టాలు అయినందున వాటిని రద్దు చేస్తున్నట్లు కార్మిక చట్టాలను నవీనీకరణ చేస్తున్నట్లు మోడీ అనుచరబృందం ప్రచారం చేసుకుంటుందని వాస్తవానికి రద్దుచేసిన 29 కార్మిక చట్టాలలో కేవలం నాలుగే చట్టాలు 1947 ముందు చేయబడినవని మిగిలిన చట్టాలన్నీ 47తర్వాత భారత పార్లమెంటులలో చర్చించబడి చేసిన చట్టాలని వారు గుర్తు చేశారు. లేబర్ కోడ్లోతో యూనియన్ పెట్టుకొని హక్కును నిర్మూలించేందుకు, కనీస వేతనాలు లేకుండా చేసేందుకు సమ్మెకు లేకుండా చేసేందుకు కార్మిక వర్గానికి రక్షణ లేకుండా చేసేందుకు ఎనిమిది గంటల పనిని 14 గంటలు మార్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. మహిళలతో అర్ధరాత్రి పనులు చేయించేందుకు పరిశ్రమల్లో కార్మికుల భద్రత రక్షణ కనీస మాత్రం కూడా అమలు చేయకుండా ఉండేందుకు కార్మిక శాఖ అధికారులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేందుకు లేబర్ కోడ్లు రూపొందించి ఉన్నారని వారు తెలిపారు. కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారి డిమాండ్ చేశారు.బిజెపి యేతర రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలు తమ రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని ప్రకటించాయని అసెంబ్లీలలో తీర్మానాలు చేశారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి.రాసుద్దీన్, డి.ప్రసాద్, గౌని నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, యన్.సంజీవ్, కొండపల్లి శ్రీనివాస్, ఎర్నం శ్రీను, యాసరపు వెంకన్న, రావురి ఉపేందర్ రావు, నరసింహా రావు, మంకేన వెంకటేశ్వర్లు, వెంకటమ్మ, శరత్, రాధ, శ్రీనివాస్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | మంగళవారం, హైదరాబాద్ | 17-03-2026
ANN తెలుగు

EDITORIAL సంపాదకీయం

# యుద్ధం నెపంతో సామాన్యుడిపై దోపిడీ దండా..

## పగటిపూటే రూ. 1500 లకు గ్యాస్ బండ!

గ్యాస్ డీలర్ల మాయాజాలంలో వందల కోట్ల కుంభకోణం.. 30 శాతం సిలిండర్ల దారి మళ్లింపు!

కృత్రిమ కొరతతో రోజుకు రూ. 6.34 కోట్ల లూటీ.. సామాన్యుడి కన్నీటిపై దళారుల కాసుల పండుగ!

వాణిజ్య సిలిండర్లపైనా కాసుల కక్కుర్తి.. రకరకాల సాకులతో రూ. 1000 అదనపు బాదుడు!



(గడల నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం.)

ప్రపంచ పటంలో ఎక్కడో రెండు దేశాల మధ్య యుద్ధం జరుగుతుంటే, ఆ ఆందోళనలను తమకు అనుకూలంగా మార్చుకుని కొందరు దళారులు సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ముందుచూపుతో దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా ఉంచింది. పంపిణీ వ్యవస్థ సజావుగా సాగుతున్నప్పటికీ, వినియోగదారుడికి చేరే చివరి దశలో మాత్రం దళారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. సర్వర్ బిజీ అని, వెనక నుంచి స్టాక్ రావడం లేదు అని పడికట్టు పదాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇదే అదనుగా చీకటి బజారులో ఒక్కో సిలిండర్‌ను ఏకంగా రూ. 1500 లకు అమ్ముకుంటూ అక్రమార్కులు కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని దళారులు సాగిస్తున్న ఈ పగటి దోపిడీ సామాన్యుడి బతుకును మరింత భారం చేస్తోంది.

### గ్లోబల్ టెన్షన్స్ వెనుక దాగి ఉన్న లోకల్ స్కామ్*

అంతర్జాతీయంగా ముడి చమురు, గ్యాస్ నిల్వలపై యుద్ధ ప్రభావం ఉన్న మాట వాస్తవమే అయినా, మన దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలను కేంద్రం ఎప్పటికప్పుడే సమకూర్చుకుంటోంది. రిఫైనరీల నుంచి పంపిణీ కేంద్రాలకు, అక్కడి నుంచి ఏజెన్సీలకు సబ్సిడీ సిలిండర్ల రవాణా నిరంతరాయంగా సాగుతూనే ఉంది. అయితే, ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి ప్రజల్లో ఒక రకమైన భయాందోళన వాతావరణాన్ని వ్యాపారులు సృష్టిస్తున్నారు. నిజంగానే యుద్ధం వల్ల గ్యాస్ రాదేమో అన్న భయంతో ప్రజలు ముందస్తు బుకింగ్స్ చేస్తుండటాన్ని డీలర్లు తమ అక్రమ దందాకు పెట్టుబడిగా మార్చుకున్నారు. సామాన్యుల భయాన్ని సొమ్ము చేసుకుంటూ ఏజెన్సీల నిర్వాహకులు నిలువునా దోచుకునే కుట్రకు తెరతీశారు.

### రాష్ట్రస్థాయిలో వాస్తవ గణాంకాలు.. 30 శాతం సిలిండర్ల దారి మళ్లింపు

గ్యాస్ కొరత అనేది కేవలం దళారులు సృష్టించిన భ్రమ అని చెప్పడానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న అధికారిక గణాంకాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కనెక్షన్ల సంఖ్యను పరిశీలిస్తే, సుమారు 1.3 కోట్ల గృహ వినియోగ కనెక్షన్లు, 2 లక్షల పైచిలుకు వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 811 ఏజెన్సీల ద్వారా ప్రతిరోజూ దాదాపు 2,50,000 గృహ వినియోగ సిలిండర్లు, 23,000 వాణిజ్య సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. రాష్ట్రంలో ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి 10,611 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ కూడా అందుబాటులో ఉంది. ఇంత పకడ్బందీ వ్యవస్థ ఉన్నప్పటికీ, రోజువారీ సరఫరా అవుతున్న 2,50,000 గృహ వినియోగ సిలిండర్లలో ఏకంగా 30 శాతం అంటే సుమారు 75,000 సిలిండర్లు నేరుగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయి. సామాన్యుడి ఇంటికి చేరాల్సిన సబ్సిడీ గ్యాస్ బండ, ఆటోలెక్కి రాత్రికి రాత్రే హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ప్రైవేట్ పరిశ్రమలకు చేరుకుంటోంది.

### వాణిజ్య సిలిండర్లపైనా కాసుల కక్కుర్తి

సామాన్యుల గృహ వినియోగ సిలిండర్లనే కాదు, వాణిజ్య వ్యాపారులను సైతం ఈ గ్యాస్ మాఫియా వదలడం లేదు. బ్లూ కలర్ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో వస్తున్న అరకొర స్టాక్‌ను కూడా ఏజెన్సీలు బ్లాక్ చేస్తున్నాయి. యుద్ధం, రవాణా ఛార్జీలు, ముడి చమురు ధరలు పెరిగాయన్న రకరకాల మాయమాటలు, కుంటి సాకులు చెబుతూ హోటల్ యజమానుల నుంచి ఒక్కో కమర్షియల్ సిలిండర్ పై రూ. 600 నుంచి రూ. 1000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్యాస్ లేకపోతే వ్యాపారం నడవని నిస్సహాయ స్థితిలో ఉన్న చిరు వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఏజెన్సీలు అడిగినంత సమర్పించుకుంటున్నారు.

### సామాన్యులు, వ్యాపారుల జేబులకు రోజూ రూ. 6.34 కోట్ల చిల్లు

ఈ కృత్రిమ కొరత వల్ల అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలపై, చిరు వ్యాపారులపై పడుతున్న ఆర్థిక భారం ఊహకు అందని స్థాయిలో ఉంది. ప్రతిరోజూ దారి మళ్లుతున్న 75,000 డొమెస్టిక్ సిలిండర్ల పై సగటున రూ. 600 చొప్పున అదనపు భారం వేసుకున్నా, రోజుకు రూ. 4.50 కోట్ల మేర సామాన్యుల జేబులు గుల్లవుతున్నాయి. మరోవైపు, రోజుకు డిమాండ్ ఉన్న 23,000 వాణిజ్య సిలిండర్ల పై కనీసం రూ. 800 చొప్పున అదనపు బాదుడు వేసుకున్నా, వ్యాపారులపై రోజుకు దాదాపు రూ. 1.84 కోట్ల భారం పడుతోంది. వెరసి, సామాన్యులు మరియు వ్యాపారుల నుంచి ఈ గ్యాస్ మాఫియా రోజుకు రూ. 6.34 కోట్లను అడ్డగోలుగా లూటీ చేస్తోంది. ఈ లెక్కన నెలకు దాదాపు రూ. 190 కోట్ల భారీ కుంభకోణం నిరాటంకంగా, పట్టపగలే సాగిపోతోంది.

### అధికారుల ఉదాసీనత.. పారదర్శకత లేమి

ఇంత పెద్ద ఎత్తున వందల కోట్ల కుంభకోణం కళ్లెదుటే జరుగుతున్నా పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ మరియు విజిలెన్స్ అధికారుల చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కావడం అత్యంత విచారకరం. ఉన్నత స్థాయి అధికారులు ఏసీ గదుల్లో సమీక్షలు చేస్తూ, సరఫరాలో లోపం లేదని ప్రకటనలు ఇస్తున్నారు. బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఏజెన్సీల గోదాములపై దాడులు శూన్యం. కమర్షియల్ సిలిండర్ల వాడకం ఉన్న ఏ ఒక్క హోటల్‌లోనూ అధికారులు తనిఖీలు చేసి, మీరు గృహ వినియోగ సిలిండర్లు ఎందుకు వాడుతున్నారు అని ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు. బుకింగ్ నుంచి డెలివరీ వరకు ఓటీపీ విధానం ఉన్నప్పటికీ, డెలివరీ బాయ్స్ మరియు డీలర్లు సిస్టమ్ లోని లొసుగులను వాడుకుని వినియోగదారులకు తెలియకుండానే డెలివరీ అయినట్లు మెసేజ్‌లు సృష్టిస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలను చూపి, కళ్లెదుటే సామాన్యుడిని దోచుకుంటున్న ఈ దళారీ వ్యవస్థను తక్షణమే ఉక్కుపాదంతో అణచివేయాలి. సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి బ్లాక్ మార్కెట్ కు పాల్పడుతున్న ఏజెన్సీల లైసెన్సులు రద్దు చేయాలి. సామాన్యులు సైతం ఆందోళనకు గురికాకుండా తమ వంతు బాధ్యతగా అక్రమాలపై ఫిర్యాదు చేయాల్సిన తరుణం ఇది. లేనిపక్షంలో, దళారుల కాసుల పండుగ ముందు సామాన్యుడి కన్నీరు ఆవిరైపోక తప్పదు.

---


**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

---

## హోర్ముజ్ జలసంధిలో అగ్రరాజ్యం విలవిల



ప్రపంచ చమురు రవాణాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధి ఇప్పుడు అంతర్జాతీయ ఉద్రిక్తతలకు కేంద్రబిందువుగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఈ కీలకమైన జల మార్గాన్ని దిగ్బంధించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ సమాజం ముందు ఉంచిన 'యుద్ధ నౌకల మోహరింపు' ప్రతిపాదన తీవ్ర చర్చనీయాంశంగా మారడమే కాకుండా, అగ్రరాజ్య దౌత్య వైఫల్యానికి అద్దం పడుతోంది. ట్రంప్ పిలుపును ఆసియా దిగ్గజాలైన భారత్, చైనాతో పాటు యూరప్ మిత్రదేశాలు సైతం సున్నితంగా తిరస్కరించడం అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో వస్తున్న మార్పులను సూచిస్తోంది. హోర్ముజ్ జలసంధిలో తమ వాణిజ్య నౌకలను కాపాడుకునేందుకు వివిధ దేశాలు తమ యుద్ధ నౌకలను పంపాలని ట్రంప్ ఇచ్చిన పిలుపును భారత్ చాలా వ్యూహాత్మకంగా తీసుకుంది. ఈ వ్యవహారంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చేసిన ప్రకటన భారత విదేశాంగ విధానంలోని పరిపక్వతను చూపుతోంది. ట్రంప్ పిలుపుపై అంతర్జాతీయంగా చర్చలు జరుగుతున్న విషయం తమకు తెలుసని చెబుతూనే, ఈ అంశంపై అమెరికాతో తాము ఎలాంటి అధికారిక లేదా అనధికారిక ద్వైపాక్షిక చర్చలు జరపలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇరాన్‌తో భారత్‌కు ఉన్న చారిత్రక, ఇంధన, వాణిజ్య (చబహార్ పోర్టు వంటివి) సంబంధాలను దృష్టిలో ఉంచుకునే భారత్ ఈ ఆచితూచి వ్యవహరించే విధానాన్ని అవలంబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, ఈ సంక్షోభ పరిష్కారం కోసం ఇతర భాగస్వామ్య దేశాలతో చర్చలు జరుపుతున్నామని చెప్పడం ద్వారా, శాంతియుత పరిష్కారానికే భారత్ మొగ్గుచూపుతోందని స్పష్టమవుతోంది. అమెరికా ఆంక్షలు, ఇజ్రాయెల్ సైనిక చర్యలకు గట్టి బదులు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇరాన్ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. తమ జలాల గుండా వెళ్లే నౌకలపై ఏమాత్రం కనికరం లేకుండా దాడులకు తెగబడుతోంది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రతిరోజూ మిలియన్ల బ్యారెళ్ల చమురు రవాణా అవుతుంది. ఇది ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు మూడో వంతు. ఇరాన్ దెబ్బతో ఈ సరఫరా చైన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే పలు ఆఫ్రికన్, ఆసియా దేశాలలో ఇంధన సంక్షోభం తలెత్తి, సాధారణ ప్రజల రవాణా, నిత్యావసర సరుకుల ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఆర్థిక వినాశనాన్ని ఆపడానికే ట్రంప్ సైనిక మోహరింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు.

### ఒంటరవుతున్న అగ్రరాజ్యం.

తన ప్రతిపాదనకు ప్రపంచ దేశాలు బారులు తీరుతాయని ఆశించిన ట్రంప్‌కు తీవ్ర నిరాశే ఎదురైంది. అగ్రరాజ్యానికి ప్రధాన పోటీదారు అయిన చైనా.. హోర్ముజ్ జలసంధికి తమ యుద్ధ నౌకలను పంపే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టింది. ఆశ్చర్యకరంగా అమెరికాకు అత్యంత ఆప్త మిత్రుడైన బ్రిటన్ కూడా ఈ సైనిక కూటమిలో చేరేందుకు సముఖత వ్యక్తం చేయలేదు. ఇక యూరోపియన్ యూనియన్ దేశాలైతే అమెరికా ముందు కీలకమైన షరతులు ఉంచాయి. అసలు ఈ ఉద్రిక్తతలను ఎప్పుడు ముగిస్తారు, దీనికంటూ ఒక స్పష్టమైన ప్రణాళిక (ఎగ్జిట్ స్ట్రాటజీ) ఉందా అని నిలదీశాయి. యుద్ధంలోకి దిగి నష్టపోవడం కంటే, దౌత్యపరమైన పరిష్కారాల వైపే యూరప్ దేశాలు మొగ్గుచూపుతున్నాయి. తన పిలుపును ఎవరూ పట్టించుకోకపోవడం, ముఖ్యంగా భారత్ లాంటి వ్యూహాత్మక భాగస్వామి కూడా మౌనం వహించడంతో ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను ఒంటరి చేయాలని అమెరికా భావిస్తే, యుద్ధ భయంతో అమెరికా ప్రతిపాదనకే ప్రపంచ దేశాలు దూరంగా జరుగుతున్నాయి. ఒకవైపు ఇంధన కొరతతో ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతుండగా, మరోవైపు ఎవరూ తగ్గకపోవడంతో హోర్ముజ్ జలసంధిలో ఏ క్షణమైనా పెను విస్ఫోటనం సంభవించే ప్రమాదం పొంచి ఉందని అంతర్జాతీయ రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

---



## విశ్వవిజేతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన సత్కారం..

### జూబ్లీహిల్స్‌లో పండుగ వాతావరణం!

**హైదరాబాద్, మహా:** T20 క్రికెట్ ప్రపంచకప్2026 సాధించి సరికొత్త చరిత్ర సృష్టించిన టీమిండియా ఆల్ రౌండర్, మన తెలుగు తేజం తిలక్ వర్మకు సొంత గడ్డపై కనీవినీ ఎరుగని రీతిలో బ్రహ్మరథం దక్కింది. విశ్వవిజేతగా స్వరాష్ట్రంలో సగర్వంగా అడుగుపెట్టిన ఈ క్రికెట్ సంచలనం నేరుగా జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. ట్రోఫీని ముద్దాడిన ఆ చేతులతోనే రాష్ట్ర ప్రజల ప్రేమాభిమానాలను అందుకుంటూ ఆయన సీఎంను కలవడం క్రీడా వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది.

### ఆత్మీయ ఆలింగనం.. అపూర్వ సత్కారం

సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి మన వరల్డ్ కప్ హీరోకు రెడ్ కార్పెట్ వేసి మరీ ఘన స్వాగతం పలికారు. "యావత్ తెలంగాణ గర్వపడేలా చేశావ్!" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిలక్ వర్మను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఆ కుర్ర హీరోను శాలువాతో సత్కరించి, ఆయన అద్భుత క్రీడా ప్రతిభను మనసారా అభినందించారు. ముఖ్యమంత్రితో తిలక్ వర్మ భేటీ అవ్వడం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. వరల్డ్ కప్ కైవసం చేసుకున్న తర్వాత నేరుగా ముఖ్యమంత్రి నివాసానికి తిలక్ వర్మ చేరుకోవడం, సీఎం స్వయంగా అభినందించడం రాష్ట్ర క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

### సందడి చేసిన దిగ్గజాలు

ఈ చారిత్రక ఘట్టానికి పలువురు రాజకీయ, క్రీడా ఉద్దండులు సాక్ష్యంగా నిలిచారు. ఈ అద్భుతమైన సత్కార కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి , క్రీడా దిగ్గజం, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ , రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తో పాటు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (సాట్స్) ఛైర్మన్ శివసేనారెడ్డి , పలువురు ఉన్నతాధికారులు స్వయంగా పాల్గొని ఈ వేడుకకు మరింత వన్నె తెచ్చారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసం మొత్తం క్రీడా ప్రముఖులు, మంత్రుల రాకతో కోలాహలంగా మారిపోయింది.

### హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాభిమానులు

ప్రపంచకప్ సమరంలో తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి, టీమిండియాకు కప్పు సాధించడంలో కీలక పాత్ర పోషించిన మన లోకల్ బాయ్ తిలక్ వర్మను.. రాష్ట్ర అగ్ర నాయకత్వం ఇంతటి సముచిత స్థానమిచ్చి గౌరవించడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక సామాన్య క్రీడాకారుడి స్థాయి నుండి విశ్వవిజేతగా ఎదిగిన తిలక్ వర్మ ప్రయాణం, దానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ఇప్పుడు ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

# కబ్జాదారుల చేతుల్లో ప్రభుత్వ భూములు

- సర్వే చేసి భూములకు రక్షణ కల్పించాలి
- భూముల పరిరక్షణ కొరకు టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలి
- మహమ్మద్ రియాజ్ డిమాండ్
- ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి మహా:** భద్రాద్రి జిల్లా కార్పొరేషన్ పరిధిలో అలాగే చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకి గురవుతున్నాయని వీటిని తొలగించడానికిఒక స్పెషల్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఐడిఓసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులకు మధుర బస్తి డివిజన్ కు చెందిన సామాజిక కార్యకర్త మహమ్మద్ రియాజ్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అసైన్డ్ స్థలాలు సామాన్య ప్రజల భూములను భూమాఫియా దారులు క్రమించుకొని సొమ్ము చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. కబ్జాదారులకు కొందరు అధికారులు సహకరిస్తున్నట్లుగా అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ భూములను ఆక్రమించడం నేరం అన్నారు. కబ్జాదారుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. భూ రికార్డులను పారదర్శకంగా నిర్వహించడంలో అధికారులు విఫలమవుతున్నారని దీనివల్ల భూ వివాదాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. జనగణన సర్వే పట్టణ మండల పరిధిలో భూముల సరిహద్దులు స్పష్టంగా లేకపోవడం వల్ల కబ్జాదారులు చెలరేగిపోతున్నారని మండిపడ్డారు. తక్షణమే రీసర్వే నిర్వహించి ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వెయ్యాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం, చుంచుపల్లి లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణలను తొలగించడానికి ఒక స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. కబ్జాదారులతో కొందరు అధికారులు చేతులు కలిపి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రతి మండలంలో ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి వచ్చే ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని మహమ్మద్ రియాజ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## గ్యాస్ కొరతతో అల్లాడుతున్నా ప్రజలకు ప్రభుత్వం
# తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి

ఖాళీ సిలిండర్లుతో సిపిఐ నాయకులు రోడ్డుపై నిరసనలు




**రాజేంద్రనగర్, మహా ;** ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధంతో దేశంలో పెట్రోల్, గ్యాస్ కొరత ఏర్పడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు, తక్షణమే నివారణ చర్యలు చేపట్టే విధంగాచొరవ చూపాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. యుద్ధం వద్దు ,ప్రపంచశాంతి కావాలి. ఇరాన్ పై యుద్ధని ఆపాలి. గ్యాస్ పెట్రోల్ కొరతను నివారించాలని శంషాబాద్ జోన్ పరిధిలోని నేషనల్ హైవే 44 ఎయిర్ పోర్ట్ వెళ్లే ప్రధాన రహదారిలో సోమవారం ఖాళీ సిలిండర్లతో నిరసనలు తెలుపుతూ ధర్నా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూగల్ఫ్ దేశాలో ఆయిల్ నిక్షేపాలపై కన్ను వేసిన అమెరికా ఎలాగైనా అక్కడ ఉన్న ప్రభుత్వాలను కూల్చి తమకు అనుకూలమైన ప్రభుత్వాల కోసం వేటాడుతుంది. ఇరాన్ పై యుద్ధం వల్ల భారతదేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇది భారత ప్రధానికి కనబడడం లేదా అని ఆయన ప్రశ్నించారు. యుద్ధం ఇదే విధంగా కొనసాగితే రాబోయే కాలంలో గ్యాస్ ఇంధనం కొరతతో పాటు ఆహార ధాన్యాల కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆయన మండిపడ్డారు. అమెరికా ఆధిపత్య పోరు కోసం ప్రపంచ దేశాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది.భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని వదిలి. ట్రంప్ ను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆర్, యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి, గిలక రాజు, శ్రీను, ప్రవీణ్ కుమార్ గౌడ్, నరేష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి డి.ఎల్.ఆర్ ఇంచార్జ్ గా మురళీకృష్ణ, సెక్రెటరీగా
# సుభాని నియామకం

నియమితులను జి.ఎం కు పరిచయం చేసిన ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు

**సత్తుపల్లి, మహా:** ఏరియా సింగరేణి దినసరి కూలీల ఇన్చార్జిగా మురళీకృష్ణ, కార్యదర్శిగా సుభానిలను కనీస వేతన మండలి చైర్మన్, సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నియమించారు. ఈ మేరకు ఇరువురికి సోమవారం నియామక పత్రాలు అందజేశారు. నియమితులైన వారిని రీజియన్ జనరల్ సెక్రెటరీ ఆల్బర్ట్, సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించారు పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో డి.ఎల్.ఆర్ ఇంచార్జ్, కార్యదర్శులుగా నియమించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతను శ్రద్ధతో వ్యవహరించి సింగరేణి దినసరి కూలీల పురోగతికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ.వి రెడ్డి, ఇక్బాల్, కృష్ణ, సుభాని, శ్రీనివాస్, వీరబాబు, సురేష్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు
# నూతన వస్త్రాలు పంపిణీ...

**రాజేంద్రనగర్ మహా ;** రంజాన్ సందర్భంగా మాజీ కౌన్సిలర్ జాంగిర్ ఖాన్ శంషాబాద్ జోన్ పరిధిలోని పారిశుద్ధ కార్మికులకు నూతన వస్త్రాలను సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ శుభ సందర్భంగా ప్రతి సంవత్సరము కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశానన్నారు.

# సోదరభావానికి ప్రతీకగా రంజాన్

తల్లోజు ఆచారి



**ఆమనగల్లు, మహా :** రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహనం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని జాతీయ ఓబిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాసాలు పాటిస్తూ భక్తి, నియమ నిష్ఠలతో ప్రార్థనలు చేయడం గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు.సోమవారం అమనగల్లు మున్సిపాలిటీలోని విద్యా నగర్ కాలనీ యంఎ పాషా ఆధ్వర్యంలో పాషా తల్లితండ్రులు, భార్య జ్ఞాపకార్థం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఓబిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి,మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్,మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్, కౌన్సిలర్ మహేష్, నిరంజన్ పాల్గొన్నారు. అనంతరం పాషా తో కలిసి కార్మికులకు చీరలు పంపిణి చేశారు.ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిల్ నవాజ్ ఖాన్,కలీమ్, అజీమ్, నాజర్,హాఫిజ్ ,తదితరులు పాల్గొన్నారు.

## రూ.8500 కోట్ల స్కాలర్షిప్, ఫిజు రీయింబర్స్ మెంట్
# విడుదల చేయాలి

- రాష్ట్రంలో విద్యారంగానికి 15% శాతం బడ్జెట్ కేటాయించాలి
- సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలి
- ఏబీవీపీ జిల్లా కన్వీనర్, పవన్ కళ్యాణ్




**రాజేంద్రనగర్ మహా ;** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో శంషాబాద్ జోన్ పరిధిలోని ఏబీవీపీ కార్యాలయంలో సోమవారం సమావేశంలో నిర్వహించారు. శంషాబాద్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ మాట్లాడుతు విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వం పట్టి పట్టనట్టువ్యవహరించటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో విద్యా రంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్రం అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుంది, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధే సాధ్యం కాదు.రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తవుతున్న విద్యాశాఖకు ఇప్పటివరకు మంత్రిని కేటాయించకపోవడం విద్యారంగానేకే దురదృష్టకరమన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తమని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగావిద్యార్థుల పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువు కొనసాగించడంలో ఇబ్బందులు పడుతున్నారు.కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యార్థుల చదువే ప్రమాదంలో ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు భరత్ యాదవ్, రాష్ట మహిళా కో కన్వీనర్ మేఘన, సోషల్ మీడియా కన్వీనర్ వేణు గోపాల్,తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరు గ్యాస్ గోడౌన్లపై
# ఆకస్మిక తనిఖీలు..

- బ్లాక్ మార్కెట్ కి తరలిస్తే కఠిన చర్యలు
- సివిల్ సప్లై డిటి శివకుమార్

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని గ్యాస్ గోడౌన్లు, గ్యాస్ ఏజెన్సీలను సోమవారం సివిల్ సప్లై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో, హెచ్‌పీసీఎల్ సేల్స్ మేనేజర్ పవన్ కుమార్‌తో కలిసి మణుగూరు సింగరేణి గ్యాస్ గోడౌన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్లైన్ బుకింగ్ విధానం వంటి అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందుతున్నాయా లేదా అనే విషయంపై వివరాలు తెలుసుకున్నారు. గ్యాస్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా సమయానికి చేయాలని డీలర్లకు సూచించారు. అలాగే మణుగూరు పట్టణంలోని పలు గ్యాస్ ఏజెన్సీలను కూడా అధికారులు తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆన్లైన్ బుకింగ్ చేసిన వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సమయానికి సరఫరా అవుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డీటీ శివకుమార్ మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్లను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లయితే సంబంధిత డీలర్లు, దాని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సంబంధిత గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్, ఫైర్
# అవగాహన సదస్సులు..

హాజరైన వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏటీజీ హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీపీఆర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించేందుకు సీపీఆర్ విధానం ఎంత ముఖ్యమో నిపుణులు వివరించారు. అలాగే పాఠశాలలో ఫైర్ అవగాహన సదస్సును కూడా నిర్వహించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలి. అగ్నిమాపక పరికరాల వినియోగం వంటి అంశాలపై ఫైర్ సిబ్బంది ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దవీటి అర్చన అజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. అలాగే ఫైర్ స్టేషన్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, ఫైర్ ఫైటర్ గోపాల్ మరియు ఫైర్ సిబ్బంది హాజరై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మరియు గ్రామస్తులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.


# మంచినీటి సమస్యకు పరిష్కారం..



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ 10వ వార్డులో ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గత కొన్ని రోజులుగా వార్డులో ఉన్న బోరు మోటారుకు సోమవారం కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ చొరవతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. వార్డులో మంచినీటి ఎద్దడిని గమనించిన కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ వార్డు ప్రజలతో కలిసి స్వయంగా పర్యవేక్షించి మొరాయించిన మోటార్ కు మరమ్మతులు చేయించారు. అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఎన్నో రోజుల నుండి చెడిపోయిన బోరు మోటర్ ను బాగు చేయించి తమకు నీటి సౌకర్యం కల్పించినందుకు వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్ గా పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంపై హర్షం వ్యక్తం అవుతోంది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు ముత్యాల పుష్పమ్మ, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో పారిశుద్ధ సమస్యలు తీరున

- డిఎంహెచ్ఓ కార్యాలయం పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కుప్పలు
- పాదాచారులు, విద్యార్థులు వెళ్లే రహదారిలో పారిశుధ్య సమస్యలు....



**రాజేంద్రనగర్, మహా ;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదు.అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ( డీఎంహెచ్ ఓ) కార్యాలయం పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.డీఎంహెచ్ ఓ కార్యాలయం నుంచి శిశుమందిర్ పాఠశాల వైపు వెళ్లే రహదారి మురికి కుపంగా మారింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని చెప్పే జిల్లా వైద్యాధికారి కార్యాలయం పక్కనేచెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు నీరుతో పేరుకుపోయి ప్రాంతం మొత్తం మురికి కుపంగా మారింది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన డ్రైనేజ్ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి రహదారి పొడుగునా పారుతు దుర్వాసన వస్తుంది. దీంతో స్థానికులు, అటు వైపు వెళ్లే పాదచారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రతి రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతు అనారోగ్యాలకు గురవుతున్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం చాలా కాలంగా అధికారుల చుట్టూ తిరిగి పలుమార్లు ఫిర్యాదులు చేసిన. పట్టించుకోలేదని అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్త కుప్పలను శుభ్రపరచి,రహదారి మరమ్మత్తులు చేసి పాదచారులు, విద్యార్థులకు సురక్షితమైన మార్గాన్ని అందించాలని స్థానికులు కోరారు.ప్రాంత ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భద్రత దృష్ట్యా జిహెచ్ఎంసి సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండీ నివారణ టీకాలు తప్పనిసరి

మండల పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్



**మొయినాబాద్ మహా:** పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, మండల పశువైద్యాధికారి డాక్టర్.అహ్మద్ అన్నారు. సోమవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో రైతుల వద్ద ఉన్న 138 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్. అహ్మద్ మాట్లాడుతూ.. పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు యజమానులు గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో టీకాలు వేయించినట్లయితే వ్యాధులు ప్రబల్లకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావు, గోరెమియా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ కంటి వైద్య శిబిరాలను
# సద్వినియోగం చేసుకోండి

క్లబ్ అధ్యక్షుడు లయన్ కే గోవర్ధన్ రెడ్డి




**ఆమనగల్లు, మహా :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే గోవర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం ఆమనగల్ పట్టణంలో రామ్ రెడ్డి లయన్ విజన్ సెంటర్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి లయన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని కే గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కండ్లను దానం చేయాలని మనం ఇద్దరికీ దృష్టి భాగ్యం కల్పించాలని ఆయన కోరారు. కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ 185 మందిని కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 43 మందిని ఆపరేషన్ నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, జిల్లా చైర్మన్ బి నటరాజ్ యాదయ్య, కొరివి వెంకటయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.



# నోముల గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు మంజూరు

ఎమ్మెల్యే రంగారెడ్డికి మాజీ ఉప సర్పంచ్ కందగట్ల జైపాల్ రెడ్డి కృతజ్ఞతలు

**రంగారెడ్డి జిల్లా మహా:** నోముల గ్రామాభివృద్ధికి, ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో 50 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది. మంచాల మండలం, నోముల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయించిన, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, మాజీ ఉప సర్పంచ్ జైపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని జైపాల్ రెడ్డి తెలిపారు.

## జల్ జీవన్ మిషన్ లో సత్తా చాటిన తెలగమల్ల ఆనంద



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మండలం చెన్నంపల్లికి చెందిన తెలగమల్ల ఆనంద జల్ జీవన్ మిషన్ అమలులోఅద్భుతమైన కృషి చేసి జల వనితగా గుర్తింపు పొందారు. న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో జరిగిన జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమంలో ఆమె ప్రతిభనుజాతీయ స్థాయిలో ప్రశంసించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ సమక్షంలో ఈ గౌరవం దక్కడం గర్వకారణం.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆమెను ప్రత్యేకంగా సన్మానించగా, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కీర్తిని జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఆనంద స్ఫూర్తిదాయకం.

## ప్రజావాణి ఫిర్యాదులను
# తక్షణమే పరిష్కరించాలి

సంబంధిత అధికారులకు ఆదేశం.. జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు సమస్యల పరిష్కారం నిమిత్తం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కచ్చితంగా సమాధానం ఇస్తూ తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (52) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ- 23, ఇతర శాఖలకు - 29, మొత్తం 52 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి సంస్థ సంవత్సర
# నిర్దేశాన్ని సాధించాలి

డైరెక్టర్(పి.పి) కె.వెంకటేశ్వర్లు

**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని సత్తుపల్లి సింగరేణి ఏరియా గనులను సంస్థ డైరెక్టర్ (పి.పి) కే.వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బొగ్గు రవాణా కేంద్రాలను పరిశీలించారు. జే.వి.ఆర్ కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్, మొబైల్ క్రషర్ 24000 టన్స్ స్టోరేజ్ బంకర్, శైలో బంకర్ ప్రాంతం నుండి రైళ్ల ద్వారా బొగ్గు రవాణా ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవంతరాలను అధిగమించి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తిని సాధించాలని, ప్రస్తుత పరిస్థితులలో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మిగిలిందని, దానికి అనుగుణంగా కార్మికులు ఉత్పత్తి సాధించటంతోనే సమాధానం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భనలో సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, జే.వి.ఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి ప్రహ్లాద్, కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ కే.సోమశేఖర్, ఎస్.ఓ.యం బి.రాజేశ్వరరావు, జి.కళ్యాణ్ రామ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి నిదర్శనం సర్పంచ్ ఇఫ్తార్ విందు



**ఆమనగల్లు, మహా :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అని ఈ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల ఐక్యతను సూచిస్తాయని ఆకుతోటపల్లి సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి అన్నారు. ఆకుతోటపల్లి గ్రామ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతా భావాన్ని పెంచుతాయన్నారు. ఉపవాస దీక్షలు కుటుంబంతో పాటు సమాజంలో శాంతి, ప్రేమ, సోదరభావం, దాతృత్వం పెంపునకు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఖాజా సాహెబ్, ఖాజా మైనుద్దీన్, సయ్యద్ బాబా, సయ్యద్ రఫీ యో ద్దీన్, మహమ్మద్ హాజీ పా, సయ్యద్ ఖాజా, సయ్యద్ జిలాని, షేక్ సాజిద్, షేక్ మహబూబ్, హబీబ్, షఫీ యో ద్దీన్, సయ్యద్ గౌస్ మియా, సయ్యద్ తఫియోద్దీన్, అబ్దుల్ వహీద్, సయ్యద్ అఫ్రోజ్, జహంగీర్ సాహెబ్, గ్రామపంచాయతీ పాలకవర్గం తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్యతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ యూనియన్ ప్రతినిధులు దేవేందర్, రజిత తమ దరఖాస్తులో ఎం సి సి ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ లకు గత 10 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను ప్రస్తుత నిత్యవసరాల దృష్ట్యా పరిశీలించి అందించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డు షంషేర్ నగర్ స్కూల్ చెందిన లక్ష్మణరావు తమ ప్రాంతంలోని ప్రభుత్వ వాటర్ ట్యాంక్ ను మున్సిపల్ అధికారుల సమన్వయం లేకుండా కూల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్చి సమర్పించారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన కోట లక్ష్మి తన భర్త వికలాంగుడని, తన కుమారుడు 7వ తరగతి చదువుతూ గురుకుల పరీక్ష రాసాడని, సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అలాగే జిల్లాలోని కొత్తూరు గ్రామ రైతులు తాము గత సీజన్ లో పండించిన సన్న రకం వడ్లు కొనుగోలు కేంద్రాలలో విక్రయించామని, ఇందుకు గాను బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహద్ హుస్సేన్ గ్రామ శివారులో తనకు గల భూమి నుండి కొంత భాగాన్ని ఇతరుల పేరిట అక్రమంగా పట్టా చేశారని, ఈ పట్టాను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి మత్స్య సహకార సంఘం సభ్యులు ఎన్నికలను నూతన సభ్యుల పేర్లు నమోదు చేసే వరకు నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన ఆలం మల్లేష్ తమ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూమిని వారు మరణించినందున వారసులమైన తమ పేరిట మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన దుర్గమ్మ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల రాజీవ్ నగర్ లో గల ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారాన్ని అందించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. బాలికల వసతి గృహంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండలం చందనాపూర్ లో గల పట్టణ ఆవాస పాఠశాలను సందర్శించి పాఠశాలలో చేపట్టిన అదనపు గదులు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి విద్యార్థుల ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినది

### మందమర్రి తాసిల్దార్ కార్యాలయం ముందర భాజాప ధర్నా



**మంచిర్యాల, మహా :** అధికార కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినదని మందమర్రి భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సప్పిడి నరేష్ ధ్వజమెత్తారు. సోమవారం మందమర్రి తాసిల్దార్ కార్యాలయం ముందర బిజెపి నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు కాని హామీలను ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయిన ఇంత వరకు హామీలను పూర్తి స్థాయిలో అమలు పరచకుండ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. రైతులకు రైతు భరోస, అర్హులైన వితంతువులకు, వృద్ధులకు పెన్షన్, అర్హులైన పేదవారికి ఇదిరమ్మ గృహాలు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అర్హులైన పేదవారికి మందమర్రి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ గృహాలను మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే పట్టణంలో డ్రైనేజి వ్యవస్థను మెరుగు పరిచి, గ్రామాలో సి.సి. రోడ్లను, డ్రైనేజీలను నిర్మించాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టాలని ఆయన అధికార పార్టీకి సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరనేని సంజీవరావు, జి జనార్ధన్, వంజరి వెంకటేష్, కర్రె రాజయ్య, మిట్టపల్లి ప్రదీప్ కుమార్, బోర్లకుంట లక్ష్మణ్, సల్లూరి సుధాకర్, దుర్గం మల్లేష్, దుర్గం శ్యామ్, మంద శ్రీనివాస్, దశరథం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ముఠా గుట్టురట్టు..

- నలుగురు నిందితుల అరెస్టు
- 2 కిలోల గంజాయి స్వాధీనం..
- ధూల్‌పేట నుంచి తెచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తింపు..
- నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి వెల్లడి..




**నల్గొండ, మహా :** జిల్లా కేంద్రంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ. 50 వేల విలువైన 2 కిలోల గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కే. శివరాం రెడ్డి తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.

**శ్మశాన వాటిక సమీపంలో ఆకస్మిక దాడి..**

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం (మార్చి 15) మధ్యాహ్నం 2 గంటల సమయంలో పట్టణ శివారులోని మునుగోడు రోడ్డు గణేష్ నగర్ కాలనీ శ్మశాన వాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ నేతృత్వంలో వన్‌టౌన్ పోలీసులు అక్కడ ఆకస్మిక దాడి నిర్వహించి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు..**

హైదరాబాద్‌లోని ధూల్‌పేట ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి స్థానిక యువతకు, విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వారి వివరాలు..మహమ్మద్ ఫుర్ఖాన్ (19) ,కారింగుల ప్రదీప్ (22),వల్కీ వినోద్ కుమార్ (26), బైరుగోండ నవీన్ (24)గా గుర్తించి వారిపై ఎన్.డి.పి.ఎస్ (NDPS) యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

**పీడీ యాక్ట్ తప్పదు డీఎస్పీ హెచ్చరిక..**

జిల్లాలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. అవసరమైతే నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల సమీపంలో నిఘా పెంచాం. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి అని ఆయన కోరారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సతీష్, లచ్చి రెడ్డి, సిబ్బంది లింగరెడ్డి, శ్రీనివాస ప్రసాద్, అంజయ్య, సైదులును జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక 'ప్రజావాణి'

- నెల చివరి శనివారం నిర్వహణ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్..
- రబీ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి..
- బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు..



**నల్గొండ, మహా :** జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధుల సమస్యల పరిష్కారానికి ఇకపై ప్రతి నెల చివరి శనివారం ప్రత్యేక 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ నెల 28 నుంచే ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్.. ఈ వారంలోనే సామూహిక 'ఇందిరమ్మ' గృహప్రవేశాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరై ఇంకా ప్రారంభం కాని పనులపై తక్షణమే నివేదిక సమర్పించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆసుపత్రులు స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు సవ్యంగా జరిగేలా మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

**రబీ కొనుగోళ్లకు సర్వం సిద్ధం..**

ఈ నెల 22, 23 తేదీల నుంచి రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుందని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం మిల్లుల ట్యాగింగ్ పూర్తి చేయాలని గ్రామ పంచాయతీల వారీగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను మరోసారి పరిశీలించి వసతులు కల్పించాలని సూచించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యేల సమ్మతితో తోఫాల పంపిణీ ఇఫ్తార్ విందుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గ్యాస్ కొరత లేదు అప్రమత్తంగా ఉండాలి..**

ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యంలో దేశీయ ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అయితే ముందస్తు జాగ్రత్తగా 'రెడ్కో' ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. "ప్రస్తుతం గ్యాస్ సరఫరాకు 21 నుండి 45 రోజుల సమయం పడుతోంది. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడినా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. హాస్టళ్లు, పాఠశాలల్లో గ్యాస్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

**ఏప్రిల్ 2న గ్రామసభలు..**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామసభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను ఎంపీడీఓలకు అందజేయాలని వాటిని గ్రామసభల్లో చదివి వినిపించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో బయో మైనింగ్ పనులు ప్రారంభించేందుకు ఏజెన్సీలకు అవసరమైన స్థలం, నీరు వంటి వసతులు ఈ వారంలోనే కల్పించాలన్నారు. గతంలో మంజూరైన రూ. 15 కోట్ల నిధులతో చేపట్టే పనులకు వెంటనే టెండర్లు పిలవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 60, ఇతర శాఖలకు సంబంధించి 45..మొత్తం 105 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

## ఐకేపీ, వీవోఏ ఉద్యోగులకు నెలకు 20 వేలు ఇవ్వాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందర ధర్నా




**మంచిర్యాల, మహా :** ఐకేపీ, వీవోఏ ఉద్యోగులకు నెలకు 20 వేలు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందర ఆ ఉద్యోగులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షులు దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల హామీ ప్రకారం వీవోఏలకు 20వేల రూపాయల వేతనం ఇస్తామని హామీనిచ్చి, నేటికీ రెండు సంవత్సరాలు గడుస్తున్న వీవోఏలకు ఇచ్చిన హామీ అమలుకు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఐకేపీ వీవోఏ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కుంటాల కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలి. గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరికి ఇరవై లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. గ్రామ సంఘం గ్రేడింగ్ తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని పేర్కొన్నారు. అర్హులైన వివోఏలను సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలు పరిష్కరించని ఎడల రాబోయే రోజుల్లో ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో దుర్గం రాములు ఐకేపీ వీవోఏ జిల్లా కార్యదర్శి, పొట్ట పోశం జిల్లా కోశాధికారి, భీంరాజ్, రాజ్యలక్ష్మి, కవిత, మల్లీశ్వరి, సమ్మయ్య, వసంత, శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు అందజేశారు.

## మెస్ ఛార్జీల బకాయిలు వెంటనే చెల్లించాలి..

- విద్యార్థుల భవిష్యత్తు కంటే విగ్రహాలే ముఖ్యమా..
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్..



**నల్గొండ, మహా :** రాష్ట్రంలోని బీసీ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫీజులు, మెస్ బిల్లుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేయాల్సిన మెస్ ఛార్జీలను ఎనిమిది నెలలకోసారి ఇస్తుండటం దురదృష్టకరమని లింగంగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు సకాలంలో అందక వసతి గృహ సంక్షేమ అధికారులు అప్పులు చేసి మరీ హాస్టళ్లను నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించి నిధుల మళ్లింపు చేపట్టడం సరికాదన్నారు.

**విగ్రహాల కంటే చదువు ముఖ్యం..**

ఫీజు బకాయిలు విడుదల చేయమని అడుగుతుంటే గాంధీ విగ్రహం కడతామనడం హాస్యాస్పదంగా ఉంది. మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. విద్యార్థుల ఫీజుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోంది అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును గాలికొదిలేసి ఆడంబరాలకు ప్రాధాన్యత ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్‌తో పాటు శివ, మహేష్ యాదవ్, అనిల్, విక్రమ్, రాజు, సునీల్ కుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



- మూడేళ్లలో నిరుపేద ముస్లింలకు ఇందిరమ్మ ఇళ్లు..
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తాం..
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి..

**నల్గొండ, మహా :** మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిన నల్గొండ జిల్లాలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న మదీనా మసీదులో మైనార్టీ సోదరులకు ఆయన 'దావత్‌ఏఇఫ్తార్' విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

**రిజర్వేషన్లు.. ఉపాధి కల్పనే లక్ష్యం..**

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ముస్లింలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారని మంత్రి గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంక్షేమ పరంపరను కొనసాగిస్తున్నామన్నారు. పట్టణంలోని పేద మైనార్టీ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఇప్పటికే 150 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మైనార్టీలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం..**

రాబోయే మూడేళ్ల కాలంలో జిల్లాలోని నిరుపేద ముస్లిలందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి ప్రకటించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైనార్టీలకు ఏ అవసరం వచ్చినా నేరుగా మేయర్ లేదా తన దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, మౌలానా హాఫేజ్ నిజాముద్దీన్, కార్పొరేటర్లు ఇబ్రహీం, సమద్, కయ్యూం బేగ్, బషీర్, హాజీ, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీరుస్తున్న జనహిత సేవలు అభినందనీయం

- జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం
- మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి-రమేష్




**బెల్లంపల్లి,మహా:** జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా వద్ద చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ హాజరై రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని అలాగే జనహిత సేవా సమితి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని జనహిత సేవా సమితి సభ్యులని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత సేవా సమితి చలివేంద్రం ఏర్పాటు తో ప్రారంభించబడి ఈ రోజుతో పదవ సంవత్సరం చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని ప్రతి రోజు దాతల సహకారంతో మినరల్ వాటర్ మరియు కొన్ని రోజులు మజ్జిగ తో ఎండల నుండి ప్రజలదాహార్తి ని తీర్చేందుకుముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తున్న దాతలు మరియు జనహిత సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు,నాయకులు, జనహిత సభ్యులు పాల్గొన్నారు.

## ట్రంపు దిష్టి బొమ్మ దహనం



**ఆలేరు, మహా:** ఇరాన్ పై అమెరికా యుద్ధం ఆపలని ,శాంతిని నెలకొల్పలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బస్టాండ్ సమీపంలో నేడు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి అమెరికా అధ్యక్షుడు ట్రంపు దిష్టిబొమ్మను దహనం చేశారు...ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెక్క వెంకటేష్, కనకయ్య,ప్రవీణ్ ,మహిళ నాయకులరాల్లు పాల్గొన్నారు.

## అమెరికా, ఇజ్రాయిల్‌లు ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని నిలుపుదల చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో



**బెల్లంపల్లి, మహా:** సిపిఐ తెలంగాణ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సోమవారం రోజు సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో కాంట చౌరస్తా వద్ద రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణకార్యదర్శి ఆడెపురాజమౌళి, రాష్ట్రసమితి సభ్యులు బొల్లంపూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య లు మాట్లాడుతూ ఇరాన్ లోని చమరు సంస్థలను ఆక్రమించుకొనుటకు దుష్టపన్నాగంలో భాగంగా ఇరాన్ అణ్వాయుదాలను కలిగియున్నదని సాకు చెబుతూ ఇజ్రాయిల్ తో కలిసి అమెరికా ఇరాన్ పై యుద్ధానికి పాల్పడి క్షిపణులతో దాడులు చేస్తూ బాంబుల వర్షం కురిపించి అనేక సంస్థలను భవనాలను పాఠశాలలను నాశనం చేస్తూ పౌరుల చిన్నారి విద్యార్థుల ప్రాణాలను బలికంటూ తీవ్ర నష్టం కలిగిస్తూ ప్రపంచశాంతికి భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.వెంటనే యుద్ధాన్ని ఆపి ప్రపంచ శాంతిని కాపాడాలని ఈ నేపథ్యంలో భారతదేశంలో చమరు గ్యాస్ లకు కొరత లేదంటూ కేంద్రంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యులపై అదనపు భారాన్ని మోపుతు గ్యాస్ కొరత కారణంగా అనేక హోటల్లు మూతపడుతున్న కారణంగా అందులో పని చేస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం వల్ల ఇతర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులపై అధిక భారం పడుతుందనీ, దేశ ప్రధాని మోదీ అమెరికాకు నమ్మిన బంటుగా మారి 140 కోట్ల భారత పౌరుల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు.రష్యా నుండి చమురు నిల్వలను దిగుమతి చేసుకోవడానికి అనుమతి ఇవ్వడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఎవరుఇచ్చారని,భారత ప్రధాని మోదీ అమెరికాకు దాసోహం చేయడం తగదని, పెంచిన రేట్లు తగ్గించాలని ఇరాన్ యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ పట్టణ సహకార దర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజ్యం, గుండా చంద్రమాణిక్యం, పట్టణ కార్యవర్గ సభ్యుడు బొంకూరి రామచందర్,మహిళాసంఘం నాయకురాలు బొల్లం సోని, బొంతల కళారాణి, కాసిపేట స్వర్ణలత, నాయకులు బూర్ల సమ్మయ్య, అందుగుల రాజేందర్, కే తిరుపతి, ఇనుముల రాయమల్లు, బుడిమే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థికాభివృద్ధి..

### మంత్రి కోమటిరెడ్డి చొరవతో 1,152 కుట్టు మిషన్లు మంజూరు..

తొలి విడతలో 56 మందికి పంపిణీ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, బుర్రి మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి..

**నల్గొండ, మహా :** మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ, మైనారిటీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద శిక్షణ పూర్తి చేసుకున్న 56 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**100 శాతం సబ్సిడీతో మిషన్లు..**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవతో నల్గొండకు 1,152 కుట్టు మిషన్లు మంజూరయ్యాయని తెలిపారు. తొలి విడతగా 40 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 56 మంది మైనారిటీ మహిళలకు రూ. 10 వేల విలువైన ఎలక్ట్రికల్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు వివరించారు. మిగిలిన వారికి విడతల వారీగా పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మిషన్లను ఖాళీగా ఉంచకుండా పని చేసుకోవాలి. తద్వారా కుటుంబ ఆదాయం పెరుగుతుందని ఆయన సూచించారు. సెట్విన్ ద్వారా బ్యూటీషియన్, టైలరింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఉపాధి అవకాశాలను వదులుకోవద్దు మేయర్..**

మేయర్ బుర్రి చైతన్య మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా మహిళల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని అందుకే భారీ సంఖ్యలో మిషన్లు వచ్చాయని తెలిపారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వం అందించే రుణాలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం కుట్టు మిషన్లు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా మిషన్లు అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ రవీందర్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారీ స్కూల్లో మధ్యాహ్న భోజన మాయాజాలం!



- మాయమవుతున్న కోడిగుడ్లు నాణ్యత లేని భోజనం..
- విద్యార్థులతో వెట్టి చాకిరీ నీళ్లు మోయిస్తున్న వైనం..
- జేబీఎస్ పాఠశాలలో విద్యార్థి సంఘాల ఆందోళన..

**నల్గొండ, మహా :** జిల్లా కేంద్రంలోని జేబీఎస్ (JBS) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా మారింది. నిబంధనల ప్రకారం విద్యార్థులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతుండగా.. అభం శుభం తెలియని విద్యార్థులతో పాఠశాల సిబ్బంది వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. సోమవారం పాఠశాలను సందర్శించిన విద్యార్థి సంఘాల నాయకులు అక్కడి పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కోడిగుడ్లు ఎటు పోతున్నాయి?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారానికి మూడు రోజులు (సోమ, బుధ, శుక్ర) విద్యార్థులకు తప్పనిసరిగా కోడిగుడ్డు అందించాలి. అయితే ఈ పాఠశాలలో విద్యార్థులకు గుడ్లు ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. సుమారు 150 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం ఐదు కిలోల సామర్థ్యం ఉన్న చిన్న పాత్రలో కూర వండుతున్నారంటేనే నాణ్యత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. మధ్యాహ్న భోజన ఇన్‌ఛార్జ్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వాహకులు కుమ్మక్కై విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**చదువు మానేసి.. నీళ్లు మోయాలా?**

పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయిస్తుండటంపై విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. ఈ నెల 6వ తేదీన మొదటి పీరియడ్ సమయంలో పేద విద్యార్థులతో బలవంతంగా నీళ్లు మోయించిన ఉదంతాన్ని వారు గుర్తు చేశారు. అటెండర్లు, స్కావెంజర్లు చేయాల్సిన పనులను కూడా విద్యార్థులతోనే చేయిస్తుండటం గమనార్హం. దీనిపై ప్రధానోపాధ్యాయులను వివరణ కోరగా ఆయన బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు.

**ప్రధానోపాధ్యాయుడి గైర్హాజరు**

హెచ్‌ఎం సమయానికి పాఠశాలకు రాకపోవడం వల్ల పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని ఫలితంగా విద్యార్థుల చదువు కుంటుపడుతోందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ ధర్నా



**ఆలేరు, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ నిరుపేదలకు ప్రభుత్వం సర్వే నెంబర్ 8 లో ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దారు కార్యాలయం ముందు నేడు ధర్నా నిర్వహించారు...ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సంవత్సరన్నర నుండి పోరాటం చేస్తూన్న ఆలేరు ఎమ్మెల్యే, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యాపట్టారుఇంటి స్థలాలు ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామని అన్నారుఅనంతరం డిప్యూటీ తహశీల్దారుకు దరఖాస్తులు అందజేశారు...కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు చెక్క వెంకటేష్, నాయకులు కనకయ్య,ప్రవీణ్,భూ పోరాట కమిటీ మహిళలు పాల్గొన్నారు..

## 6 గ్యారంటీలు అమలు చేయాలని బిజెపి ధర్నా



**ఆలేరు, మహా:** గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి అధికారం లోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని బిజెపి జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు మధురి అన్నారు...యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహశీల్దారు కార్యాలయం ముందు సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని,రైతులకు రైతు బంధు వెంటనే విడుదల చేయాలని,నాణ్యమైన విద్యుత్ సరఫర చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు...ఈ ధర్నా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు ధర్న అనంతరం డిప్యూటీ తహశీల్దారుకు వినతి పత్రం సమర్పించారు..ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మధురి, కౌన్సిలర్ పాశికంటి సంపత్, ,నాయకులు కామిటికారి కృష్ణ, కుమారస్వామి,గంగేష్ నర్సింహులు,,నర్సింహ్మ రెడ్డి,శాంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెట్టాలి





జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి పల్లి గ్రామంలో మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులకు బోధించేందుకు ఎంతమంది టీచర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన మరియు రుచికరమైన ఆహారం అందించాలని, ఎప్పటికప్పుడు తాజాగా ఉన్న కూరగాయలు మాత్రమే వంటకు ఉపయోగించాలన్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు అధికారులు తప్పనిసరిగా రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల డార్మిటరీ హాల్ ను కలెక్టర్ పరిశీలించి గదిలో సీలింగ్ ఫ్యాన్లు అన్ని పని చేస్తున్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించగా టాయిలెట్స్ పరిశుభ్రంగా లేవని,తలుపులు కూడా సరిగా లేవని వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.అనంతరం 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్నందున కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని ,వెనుకబడిన సబ్జెక్టుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచనలు చేశారు. పరీక్షలు వ్రాసే సమయంలో భయాందోళనకు గురి కాకుండా మంచి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలన్నారు.10 వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం ద్వారా భవిష్యత్ లో ఉన్నత చదువులకు వెళ్ళవచ్చని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులతో పాస్ అవ్వాలని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు.10వ తరగతి పరీక్ష వ్రాసే విద్యార్థులకు కలెక్టర్ ఆల్ ది బెస్ట్ తెలిపారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ కార్యాలయం తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు


**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం లోని కొలనుపాక గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. సిబ్బంది హాజరు వివరాలను చూసి, గ్రామ ప్రజలకు సమయానికి సేవలు అందించే విధంగా పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఇంటి పన్ను వసూలు చాలా ముఖ్యమని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పన్ను వసూలును మార్చి 31వ తేదీ లోపు వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడువులోపు పన్ను వసూలు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు సమర్థవంతంగా కొనసాగాలంటే ఆదాయ వనరులు పెరగడం అవసరమని పేర్కొన్నారు.అనంతరం ఆయన నర్సరీలను కూడా సందర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో మొక్కల పెంపకం మరియు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్కువ సంఖ్యలో మొక్కలు పెంచి గ్రామాల్లో నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. భోజనం రుచికరంగా, పరిశుభ్రంగా ఉందా లేదా అనే విషయాలను స్వయంగా పరిశీలించాలని తెలిపారు. పిల్లలకు పోషకాహారంతో కూడిన భోజనం అందేలా చూడటం చాలా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువు అభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో యం పి. ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



**ఆలేరు, మహా :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలేరు పట్టణంలోని ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు... ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేస్తూ సాంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మహిళా అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి హాజరై ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ ప్రజలు పాల్గొని ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, పలువురు కౌన్సిలర్లు,తహశీల్దారు ఆంజనేయులు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎ ఏజాజ్,సలీమ్, నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు ముస్లిం మత పెద్దలు కార్యక్రమంలో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు

## బెంగాల్ పోరుకు బీజేపీ సై..



भारतीय जनता पार्टी
केन्द्रीय कार्यालय
6ए, दीनदयाल उपाध्याय मार्ग, नई दिल्ली-110002
फोन: 011-23500000 फैक्स : 011-23500190

दिनांक: 16.03.2026

प्रेस विज्ञप्ति

भारतीय जनता पार्टी की केन्द्रीय चुनाव समिति की बैठक माननीय श्री नितिन नवीन की अध्यक्षता में दिनांक 12.03.2026 को सम्पन्न हुई।

बैठक में माननीय प्रधानमंत्री श्री नरेन्द्र मोदी, माननीय रक्षा मंत्री श्री राजनाथ सिंह, माननीय गृहमंत्री श्री अमित शाह एवं केन्द्रीय चुनाव समिति के अन्य सभी सदस्य उपस्थित रहे।

केन्द्रीय चुनाव समिति ने होने वाले पश्चिम बंगाल विधानसभा चुनाव 2026 के लिए निम्नलिखित नामों पर अपनी स्वीकृति प्रदान की है।

पश्चिम बंगाल विधानसभा चुनाव 2026

| क्र. | विधानसभा का नंबर एवं नाम | | उम्मीदवार का नाम |
|---|---|---|---|
| 1. | 3 | कूचबिहार उत्तर (अजा) Coochbehar Uttar (SC) | श्री सुकुमार रॉय Shri Sukumar Roy |
| 2. | 5 | सीतलकुची (अजा) Sitalkuchi (SC) | श्रीमती सावित्री बर्मन Smt. Savitri Barman |
| 3. | 7 | दिनहाटा Dinhata | श्री अजय रॉय Shri Ajay Roy |
| 4. | 9 | तूफानगंज Tufanganj | श्रीमती मालती रावा रॉय Smt. Malati Rava Roy |



| क्र. | विधानसभा का नंबर एवं नाम | | उम्मीदवार का नाम |
|---|---|---|---|
| 11. | 25 | माटीगाड़ा-नक्सलबाड़ी (अजा) Matigara-Naxalbari (SC) | श्री आनंदमय बर्मन Shri Anandamay Barman |
| 12. | 26 | सिलीगुड़ी Siliguri | डॉ. शंकर घोष Dr. Shankar Ghosh |
| 13. | 27 | फांसीदेवा (अजजा) Phansidewa (ST) | श्री दुर्गा मुर्मू Shri Durga Murmu |
| 14. | 30 | गोलपोखर Goalpokhar | श्री सरजीत बिस्वास Shri Sarjit Biswas |
| 15. | 31 | चाकुलिया Chakulia | श्री मनोज जैन Shri Manoj Jain |
| 16. | 32 | करणदिघी Karandighi | एड. बिराज बिस्वास Adv. Biraj Biswas |
| 17. | 34 | कालियागंज (अजा) Kaliaganj (SC) | श्री उत्पल महाराज Shri Utpal Maharaj |
| 18. | 35 | रायगंज Raiganj | श्री कौशिक चौधरी Shri Kaushik Chowdhury |
| 19. | 37 | कुशमंडी (अजा) Kushmandi (SC) | श्री तापस चंद्र रॉय Shri Tapas Chandra Roy |
| 20. | 38 | कुमारगंज Kumarganj | श्री सुवेंदु सरकार Shri Suvendu Sarkar |
| 21. | 39 | बालुरघाट Balurghat | श्री बिद्युत रॉय Shri Bidyut Roy |
| 22. | 40 | तपन (अजजा) Tapan (ST) | श्री बुधराई टुडू Shri Budhrai Tudu |
| 23. | 41 | गंगारामपुर (अजा) | श्री सत्येंद्र नाथ राय |

- 144 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల
- బెంగాల్ ఓటర్ల జాబితాలో భారీ కోత..
- సందిగ్ధంలో 42 లక్షల మంది ఓటర్ల భవితవ్యం!
- పార్టీల ఘర్షణలపై ఈసీ సీరియస్..
- హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్.
- కేరళలో బీజేపీ సరికొత్త వ్యూహం..
- క్రైస్తవ ఓటు బ్యాంకు లక్ష్యంగా 47 మందితో తొలి జాబితా!

**హైదరాబాద్,మహా.** 2026 ఏప్రిల్ 23 , 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ తన సన్నద్ధతను వేగవంతం చేసింది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన వెంటనే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 144 మంది అభ్యర్థులతో కూడిన తన తొలి జాబితాను బీజేపీ విడుదల చేయడం విశేషం. అధికార తృణమూల్ కాంగ్రెస్ కి గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైన బీజేపీ, ఈ జాబితాలో సువేందు అధికారి, దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్ వంటి ఉద్దండులకు కీలక నియోజకవర్గాలైన భవానీపూర్, ఖరగ్‌పూర్ సదర్, అసన్‌సోల్ దక్షిణం నుండి అవకాశం కల్పించింది. అలాగే ఈ జాబితాలో 10 మంది మహిళా అభ్యర్థులకు కూడా స్థానం దక్కింది.

**ఓటర్ల సంఖ్యలో భారీ కోత.. న్యాయపరమైన చిక్కులు***

ఈసారి పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో ప్రధానంగా చర్చనీయాంశమైన అంశం ఓటర్ల జాబితా తగ్గింపు. గత ఏడాది నవంబర్‌లో 7.66 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య, ఫిబ్రవరి 28న విడుదల చేసిన తుది జాబితా నాటికి 6.44 కోట్లకు పడిపోవడం పెద్ద వివాదంగా మారింది. సుమారు 42 లక్షల మంది ఓటర్లను "లాజికల్ డిస్క్రిపెన్సీ" విభాగం కింద వర్గీకరించి, న్యాయపరమైన పరిశీలనకు పంపారు. వీరి భవిష్యత్తు ఇంకా సందిగ్ధంలోనే ఉంది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయడానికి ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుండి వచ్చిన వారితో కలుపుకుని మొత్తం 732 మంది జ్యుడీషియల్ ఆఫీసర్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**ఎన్నికల సంఘం కఠిన హెచ్చరికలు.. ఫలితాల తేదీ**

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కడంతో పాటే అవాంఛనీయ ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ మరియు బీజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఎన్నికల నియమావళి (కోడ్) ఇప్పటికే అమల్లోకి వచ్చినందున, హింసాత్మక ఘటనలకు పాల్పడే వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాన ఎన్నికల కమిషనర్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఏప్రిల్‌లో జరిగే ఈ ఎన్నికల ఫలితాలు, ఇతర రాష్ట్రాలతో పాటుగా మే 4వ తేదీన వెలువడనున్నాయి.

**కేరళలో బీజేపీ సరికొత్త వ్యూహం.. క్రైస్తవ ఓటు బ్యాంకుపై గురి**

ఒకవైపు పశ్చిమ బెంగాల్‌పై దృష్టి పెడుతూనే, మరోవైపు కేరళ అసెంబ్లీ ఎన్నికల (2026) కోసం కూడా బీజేపీ తన తొలి జాబితాను (47 మంది అభ్యర్థులు) ప్రకటించింది. కేరళలో మైనారిటీలైన క్రైస్తవ ఓటు బ్యాంకును ఆకర్షించడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహరచన చేసినట్లు స్పష్టమవుతోంది. ఇందులో భాగంగా, క్రైస్తవులు అధికంగా ఉండే కొట్టాయం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్‌ను కంజిరపల్లి నుండి, అలాగే కేరళ కాంగ్రెస్ మాజీ నాయకుడు పీసీ జార్జ్ మరియు ఆయన కుమారుడు షోన్ జార్జ్‌లను పూంజర్ మరియు పాలాల నుండి బరిలోకి దించడం ఈ సరికొత్త రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతోంది.



## గడ్డి మందు నిషేధించాలి

### వ్యవసాయ డైరెక్టర్ ను కోరిన జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ

**హైదరాబాద్, మహా:** కలుపు నివారణ కోసం వాడే గడ్డి మందు మూలంగా తెలంగాణలో రోజుకు అనేక మంది రైతులు చనిపోతున్నారని, దానిని తక్షణమే నిషేధించాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడ్డి మందు నిషేధంతో పాటు వ్యవసాయ మందుల షాపుల్లో వాటి విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కేఎస్ఆర్ సోమవారం తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ బి. గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలుపు నివారణ కోసం వాడే గడ్డి మందు రైతుల పాలిట శాపంగా మారుతోందని, చిన్న చిన్న ఇబ్బందులతో మనస్థాపానికి గురైన వారు ఆవేశంతో దానిని తాగడం వల్ల వెంటనే మరణిస్తున్నారని, ఫలితంగా అనేక రైతు కుటుంబాలు ఆగమవుతున్నాయని ఆయన వివరించారు. గడ్డి మందు వల్ల తెలంగాణ వ్యాప్తంగా రోజుకు పదుల సంఖ్యలో రైతులు చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందు వల్ల భూమి కూడా విషతుల్యం అవుతుందని వెంటనే దీనిని నిషేధించాలని కేఎస్ఆర్ గౌడ పేర్కొన్నారు. గడ్డి మందు నిషేధం కోసం చర్యలు తీసుకుంటామని, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని డైరెక్టర్ తెలిపారు. తమ పరిధి మేరకు తక్షణమే ఒక నెల రోజుల పాటు ముందు నిషేధానికి తాము చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి ప్రిస్క్రిప్షన్ మేరకు ముందును అమ్మడం కూడా సరికాదని, గడ్డి మందును పూర్తిగా నిషేధించాలని కేఎస్ఆర్ తెలిపారు. గడ్డి ముందుకు ప్రత్యామ్నాయాలు చూడాలని కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు.

## జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ గా సైదులు బాధ్యత స్వీకరణ


### శాంతి భద్రతల పరిరక్షణే ముఖ్యం



**కుషాయిగూడ, మహా ;** జవహర్ నగర్ నూతన ఇన్స్పెక్టర్ గా ఎస్. సైదులు బాధ్యతలు స్వీకరించారు. మల్కాజిగిరి కమిషనరేట్ ఆన్ అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ లో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎస్. సైదులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని, నేరాలను అదుపులో ఉంచడానికి నూతన పోలీసింగ్ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో, చట్ట ప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు. నేరాల అదుపులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నేరాలను అదుపులోకి తీసుకొస్తామని తెలిపారు. యువత పెడదారిలో పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఇద్రిస్‌అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బలితీసుకున్న వేధింపులు

- కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థిని బలవన్మరణం
- చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన శ్రీవిద్య
- బనిగండ్లపాడులో అలుముకున్న విషాదఛాయలు




**హైదరాబాద్, మహా:** ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటుందనుకున్న ఆ బిడ్డ తల్లిదండ్రులకు తీరని గర్భశోకం మిగిల్చింది. తోటి విద్యార్థుల పైశాచిక వేధింపులు భరించలేక అర్థాంతరంగా తనువు చాలించింది. కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పై తరగతుల విద్యార్థుల మానసిక హింసకు కృంగిపోయిన ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతూ కన్నుమూసిన హృదయవిదారక ఘటన సోమవారం వెలుగుచూసింది.ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కుటుంబం ఉపాధి నిమిత్తం మధిర పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నది. వారికి ఇద్దరు సంతానం. పంతొమ్మిదేళ్ల వయసున్న కూతురు శ్రీవిద్య వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో సైన్స్ విభాగంలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తూ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన విద్యాసంస్థలో కొందరు విద్యార్థుల ప్రవర్తన ఆమె పాలిట శాపంగా మారింది. వారి రోజువారీ వేధింపులకు నిత్యం నరకయాతన అనుభవించిన ఆ పడుచుగుండె తీవ్ర మనస్తాపానికి గురైంది. భరించలేని బాధతో ఈ నెల ఎనిమిదవ తేదీన ప్రాణాలు తీసుకునేందుకు యత్నించింది.తీవ్ర అస్వస్థతకు గురైన శ్రీవిద్య తన దయనీయ స్థితిని కన్నతల్లికి రోదిస్తూ తెలియజేసింది. విషయం తెలుసుకుని తల్లడిల్లిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సూచనల మేరకు హైదరాబాదుకు తీసుకువెళ్లారు. అక్కడ మృత్యువుతో పోరాడుతూ చికిత్స పొందుతున్న ఆ యువతి సోమవారం తుదిశ్వాస విడిచింది. చేతికొచ్చిన బిడ్డ ఇలా విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతురాలి స్వగ్రామం బనిగండ్లపాడులో తీవ్ర విషాదం అలుముకుంది. శ్రీవిద్య తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశ్వవిద్యాలయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దారుణ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెలుగు చూడాల్సి ఉన్నది.



# రషా తడానీ బర్త్ డే.. స్పెషల్

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం అవుతోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ మూవీకి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రషా తడానీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమాతో నటి రాషా థడాని టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇందులో మంగ అనే పాత్రలో అభిమానులను మెప్పించనుంది. ఇప్పటికే 'ఉయి అమ్మ' అనే సాంగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇవాళ బాలీవుడ్ బ్యూటీ రషా తడానీ బర్త్ డే కావడంతో మేకర్స్ ప్రత్యేకంగా విషెస్ తెలిపారు. ఈ మూవీ సెట్‌లో రషా నటన, హావభావాలతో కూడిన వీడియోను పోస్ట్ చేశారు. అందరూ కలిసి రషాకు హ్యాపీ బర్త్ డే విష్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామాలో మోహన్ బాబు ఇందులో ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్నిచందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ సినిమా ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా.. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు.



# చెప్పిందొకటి.. తీరా సెట్‌కు వెళ్లాక బోల్డ్ సీన్స్ చేయమని బలవంతం!

సల్మాన ఖాన్ 'వీర్' (2010) సినిమాతో వెండితెరపై కథానాయికగా పరిచయమైంది జరీన్ ఖాన్. ఆ మరుసటి ఏడాది అతడి మూవీలోనే స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. అలా ఓ పక్క సినిమాలు చేస్తూనే మరోపక్క ఐటం సాంగ్స్ చేసింది. అయితే హేట్ స్టోరీ 3 మూవీ చేశాక తనను అందరూ తక్కువ చేసి చూశారంటోంది జరీన్ ఖాన్.

## ముందో మాట చెప్పి..

తాజాగా ఓ ఇంటర్వ్యూలో జరీన్ ఖాన్ మాట్లాడుతూ.. హేట్ స్టోరీ 3లో నటించాక అందరూ నన్ను చులకన చేసి మాట్లాడారు. తనకు యాక్టింగ్ రాదు కాబట్టే అలా దుస్తులు విప్పే సన్నివేశాల్లో నటించిందని కామెంట్స్ చేశారు. ఆ సమయంలో దర్శకుడు అనంత్ మహదేవన్ అక్సర్ 2 సినిమా ఆఫర్ చేశారు. అయితే ఇందులో బోల్డ్ సన్నివేశాలుండవని హామీ ఇచ్చారు. కథంతా చెప్పి ఇది హేట్ స్టోరీ మూవీలా అయితే ఉండదని నొక్కి చెప్పాడు. దాంతో సరేనన్నాను.

## చెప్పిందొకటి.. చేసిందొకటి

కానీ, సెట్‌కు వెళ్లాక అంతా తలకిందులైంది. ముద్దు సన్నివేశం అంటారు.. సడన్ దుస్తులు విప్పేయమంటారు. పొట్టి దుస్తులే ధరించాలంటారు! నా బాధేంటంటే.. స్క్రిప్ట్ ఒకరకంగా చెప్పి షూటింగ్ మరోరకంగా జరిపారు. అదే వాళ్లతోనూ అన్నాను.. ఇలాంటి సన్నివేశాల్లో నటించడం నాకు సమస్య కాదు.. కానీ, మీరు నాకు చెప్పిందేంటని అడిగాను. కేవలం నా గత సినిమా చూసి కావాలని ఇందులో అలాంటి సీన్లు ఇరికిస్తున్నారన్నాను.

**ఎంత అన్యాయం?**

నామాట ఎవరూ పట్టించుకోలేదు. నాకు అందరూ వ్యతిరేకంగా మారారు. నిర్మాతలు పూర్తిగా అలా రెచ్చగొట్టే సన్నివేశాలే చేయమని బలవంతపెట్టారు. అదెంత అన్యాయం! అయినా నేను సహించాను. ఇప్పుడు గొడవకు దిగి వెళ్లిపోతే వాళ్ల పెట్టుబడి అంతా వృథా అవుతుందని సినిమా పూర్తి చేశాను. కానీ, చివరకు సినిమా స్క్రీనింగ్‌కు కూడా నన్ను పిలవలేదు. కానీ నేను సరిగా పని చేయనని నన్ను బద్నాం చేశారు అని జరీనా ఖాన్ చెప్పుకొచ్చింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com